
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY







కర్నూలు సూర్యదేవాలయంలో బారులుదీరిన భక్తులు

# ఘనంగా రథసప్తమి

## భక్తులతో కిటకిటలాడిన సూర్యనారాయణ స్వామి దేవస్థానం










కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో మంగళవారం రథసప్తమి వేడుకలు కన్నుల పండువగా సాగాయి. ఆలయంలో 6వ వార్షికోత్సవాలు రెండు రోజులుగా కొనసాగుతుండగా, మంగళవారం రథసప్తమిని పురస్కరించుకుని ఆలయంలోని మూలమూర్తికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి భక్తులు స్వయంగా స్వామి స్ఫటిక యంత్రానికి అభిషేకము చేసే అవకాశం కల్పించారు. ఆలయ వేద పండితుడు సుబ్రహ్మణ్యం శర్మ పర్యవేక్షణలో అర్చక స్వాములు సూర్యభగవానుడికి ఉదయం 10 గంటలకు అరుణ హోమం, సూర్య పంచాతన హోమము చేపట్టి మహా పూర్ణాహుతి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం హైదరాబాదుకు చెందిన డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం చేత భక్తిగానలహరి కార్యక్రమాన్ని నిర్వహించారు. రథసప్తమి వేడుకను పురస్కరించుకుని కార్యక్రమంలో వేలాదిగా వచ్చిన భక్తులతో దేవస్థానం కిటకిటలాడింది. జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి, లోక్ అదాలత్ న్యాయాధికారి బి.లీలా వెంకట శేషాద్రి, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం జరిగిన వేడుకల్లో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పాల్గొని సూర్యనారాయణ స్వామికి పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు టీఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఫోర్త్ టౌన్ ఎస్ఐ గోపీనాథ్ బందోబస్తును ఏర్పాటు చేశారు.




# రైతుకు రుణం సులువే..!

- ప్రతి గ్రామంలో వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు
- కసరత్తు చేస్తున్న నాబార్డు అధికారులు
- అన్నదాతకు తప్పనున్న ప్రైవేట్ అప్పుల బాధ

**కర్నూలు మండలంలోని పసుపుల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో నాలుగు వేల మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఎనిమిది గ్రామాల్లోని ఈ రైతులకు ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల సాగుకు రుణాలతోపాటు పొలాలు, ఇతర అభివృద్ధి పనులకు దీర్ఘకాలిక రుణాలను అధికారులు అందజేస్తున్నారు. రైతులకు రుణాలు ఇవ్వడంతో పాటు రుణ బకాయిలు సకాలంలో వసూలు చేయడంలో సహకార సంఘం అధికారులు కుస్తీ పడాల్సిన పరిస్థితి దాపురించింది. ఇదే పరిస్థితిని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లోని నాలుగు లక్షల మంది రైతులకు రుణాలు అందించలేక ఆ సంఘాల్లోని సిబ్బంది నానా అగచాట్లు పడుతున్నారు. ఈ పరిస్థితిని గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం రుణాల మంజూరును సులభతరం చేయడంతోపాటు ఇతర కార్యకలాపాలను ఆ సంఘాలు చేపట్టేలా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.**

కర్నూలు అగ్రికల్చర్,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో అష్టకష్టాలు పడుతున్నారు. అయినా అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల నుంచి రైతులను గట్టెక్కించే దిశగా కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ వివరాలను నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి బుధవారం వెల్లడించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల పరిధిలో దాదాపు నాలుగు లక్షల మంది రైతులు ఉన్నారు. ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఈ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారానే కేంద్ర సహకార బ్యాంకు రుణాలను రైతులకు అందిస్తోంది. 99 ప్రాథమిక వ్యవసాయ సంఘాల ద్వారా దాదాపు నాలుగు లక్షల మంది రైతులకు రుణాలు అందించే కార్యక్రమాన్ని చేపట్టడం కష్టసాధ్యంగా మారింది. ఈ పరిస్థితులను నివారించి రైతులకు మరింత చేరువలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను ఏర్పాటు చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు విధి విధానాలు రూపొందించి నివేదికలు పంపాలని నాబార్డు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.



మిగతా 6వ పేజీలో

# అటవీ భూముల కబ్జా

- నంద్యాల డివిజన్‌లో 500 ఎకరాలు
- అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు
- సర్వేకు సిద్ధమైన అటవీ, రెవిన్యూ అధికారులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అటవీ భూముల్లో చిన్న మొక్క పీకితే పరుగులు పెట్టే అటవీశాఖ అధికారుల కళ్లెదుటే వందల ఎకరాలు కబ్జా అవుతున్నాయి. అటవీ భూముల పరిరక్షణ పర్యావరణ కోణంలో కూడా చాలా కీలకం. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. భూములు కబ్జాకు గురైనా కేవలం నోటీసులకే పరిమితమయ్యారు. భవిష్యత్ తరాలకు అడవులను మిగల్చకుండా భూ ఆక్రమణదారులు అడవులను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. పంటల సాగుపేరిట ప్రకృతి సంపదైన అటవీ భూములను ఇష్టానుసారంగా ఆక్రమించి లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. నంద్యాల డివిజనల్ అటవీశాఖ పరిధిలోని మహానంది, బండిఆత్మకూరు మండలాల పరిధిలో వందల ఎకరాల భూములను గత ఇరవై యేళ్లుగా ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నారు. సర్వే నంబర్ 604, 642లలో గత 20 యేళ్లుగా అటవీ భూములను ఆక్రమించి పంటలు సాగుచేస్తున్నారని, అందులో అత్యధికంగా వైసీపీ నాయకుల కబంధ హస్తాల్లో ఉన్నట్లు ఇటీవల అటవీశాఖ ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో అక్రమార్కులకు కేవలం నోటీసులు మాత్రమే జారీచేసి అధికారులు చేతులు దులుపుకున్నారు.

**రెవిన్యూ, అటవీశాఖల మధ్య సమన్వయ లోపం**

నంద్యాల డివిజన్‌లో రెవిన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న సమన్వయ లోపం కారణంగా అటవీ భూములు కబ్జాకు గురయ్యాయి. రిజర్వ్ ఫారెస్ట్ భూములను సైతం కాజేసి తోటలను పండిస్తున్నారు. నంద్యాల ఫారెస్ట్ డివిజన్ పరిధిలో తెలుగుగంగ ప్రాజెక్టుకు 219 హెక్టార్ల భూమిని కేటాయించారు. తెలుగు గంగ కాల్వ అడవి మధ్యలో నుంచి వెళ్లడం అడవి వైపు కాకుండా మరోవైపు సుమారు 300 ఎకరాల మేర భూమి మిగిలిపోయింది. దీనిపై అటవీ శాఖ అధికారులు దృష్టిసారించకపోవడంతో ఆ భూములన్నీ అన్యాక్రాంతమయ్యాయి.



అన్యాక్రాంతమైన ఫారెస్ట్ భూములు

**సర్వే చేయబోతున్నాం**

రెవిన్యూ, పోలీసు అధికారులను సమన్వయం చేసుకుని రెండు రోజుల్లో సర్వే ప్రారంభించబోతున్నాం. ఆక్రమణలకు గురైన భూములను గుర్తించి స్వాధీనం చేసుకుంటాం. అటవీ భూములను ఎవరైనా కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.
**-దినేశ్‌కుమార్‌రెడ్డి, రేంజ్ ఆఫీసర్, నంద్యాల**

**సర్వేకు ఆదేశించిన మంత్రి పవన్‌కళ్యాణ్**

అక్రమార్కులకు కేవలం నోటీసులకే పరిమితమైన అధికారులు మంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. రెవిన్యూ పోలీసు శాఖలతో సమన్వయంగా వ్యవహరిస్తూ ఆక్రమణలదారుల భూ ఆక్రమణలు లెక్కలు తేల్చాలని ఆదేశించారు. దీంతో నిద్రావస్థలో ఉన్న అటవీశాఖ అధికారులు ఎట్టకేలకు మేల్కొని సర్వేకు దాఖలు చేశారు. రెండు రోజుల్లో పూర్తి సర్వేకు పూనుకున్నారు.



# ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

- జిల్లాలో 91 కేంద్రాలు
- నేటి నుంచి పరీక్షలు ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఈసారి ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలను నాన్ జంబ్లింగ్ విధానంలో కొనసాగనున్నాయి. ఏ కళాశాల విద్యార్థులు ఆ కళాశాలలోనే ప్రాక్టికల్స్ పరీక్షలను ఏర్పాటు చేసేలా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జంబ్లింగ్ విధానం ఎత్తివేయడంతో విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్స్, అధికారులకు ఊరట కలిగింది. అయితే ప్రతి సెంటరులో 50 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉంటే సమీపంలోని కళాశాలలోని విద్యార్థులను ఒకే చోట కలిపి ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 20వ తేదీ వరకు జరిగే సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలకు కర్నూలు జిల్లాలో మొత్తం జనరల్ కోర్సులో 15,194 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. బైపీసీ విభాగం విద్యార్థులు 4679, ఎంపీసీ విభాగంలో 10,515 మంది, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 4172 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ విద్యార్థుల కోసం మొత్తం జిల్లా వ్యాప్తంగా 91 ప్రయోగ పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందులో కర్నూలు నగరంలోని 46 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నారాయణ, చైతన్య కళాశాలల కేంద్రాల్లో మాత్రమే ఏ, బీ సెంటర్లను కొనసాగించారు. జిల్లాలో సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలు 5 విడతల్లో జరగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో కొనసాగుతాయి.



**పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు**



ఇంటర్మీడియట్ సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని ఆయా పరీక్ష కేంద్రాల నిర్వహకులను ఆర్ఐవో గురువయ్యశెట్టి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ టౌన్‌మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలపై ఓరియంటేషన్ ప్రోగ్రాం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ల్యాబ్స్‌లో పరికరాలు, ఫర్నీచర్స్ కొరత లేకుండా గాలి, వెలుతురు ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలు పూర్తయిన వెంటనే విద్యార్థులకు సంబంధించిన మార్కులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి పంపాలన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ జి. లాలెప్ప, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, డీఈసీ సభ్యులు నాగభూషణం రెడ్డి, పద్మావతి, సురేష్ చంద్ర, మల్లికార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.
**- ఆర్ఐవో, ఎస్వీఎస్ గురువయ్యశెట్టి**

# 10న నులి పురుగుల నిర్మూలన దినం



నులిపురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీన నులి పురుగుల నిర్మూలన జాతీయ దినం సందర్భంగా 1 నుంచి 19 సంవత్సరాలలోపు విద్యార్థులందరి చేత నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా విద్యాశాఖ అధికారులు, ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1886 అంగన్‌వాడీ కేంద్రాలు, 2331 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 103 జూనియర్ కళాశాలలు, 32 ఐటీఐ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులందరి చేత అల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, డీఎంహెచ్‌వో డా. శాంతికళ పాల్గొన్నారు.

బాలోత్సవాలకు వేళాయే..! 6

ట్రేడ్ లైసెన్సు చెల్లించం
మద్యం వ్యాపారుల విముఖత
నోటీసులు జారీ చేస్తున్న నగర పాలక అధికారులు 174

ఓ ఊరి కథ

# ప్రభుత్వ ఉద్యోగుల ప్యాలకుర్తి



ప్యాలకుర్తి మెయిన్ బజార్

ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఆ గ్రామంలో ఏకంగా 60 మందికిపైనే ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వివిధ శాఖల్లో సర్కారు కొలువులు సాధించి మిగతా ఊళ్లకు ఆదర్శంగా నిలిచారు. గత ఏడాది ఓ యువకుడు ఈ గ్రామం నుంచే ఐపీఎస్‌కు ఎంపికై తమ ఊరి పేరును నలుమూలలా చాటాడు. అలాగే ఎంతోమంది వైద్యులనందించిన ఘనత కూడా ఆ ఊరిదే. ఆ గ్రామమే కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి.

- కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి)

- గ్రామంలో 60 మందికిపైనే సర్కారు కొలువులు
- పిల్లలను కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులు
- గత ఏడాది ఐపీఎస్‌కు యువకుడి ఎంపిక

**విద్యకు అధిక ప్రాధాన్యత:** ప్యాలకుర్తి గ్రామస్థులకు వ్యవసాయమే ప్రధాన ఆదాయ వనరు. ఇక్కడ ప్రజలంతా అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉంటారు. గ్రామ జనాభా పరంగా చూస్తే ఎస్సీలు 1221, బీసీలు 4935, జనరల్ 2241 మంది ఉన్నారు. వీరిలో అధిక శాతం రైతులు, కూలీలే. ఎల్లెల్సీ కెనాల్, బోర్లు ప్రధాన నీటి వనరు. ప్యాలకుర్తి రైతులు డ్రిప్ ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులు పొందుతున్నారు. మండలంలో మరే గ్రామంలో డ్రిప్ వనరును ఇంతలా వినియోగించలేదంటే అతిశయోక్తి కాదు. ప్యాలకుర్తి రైతులు, కూలీలు చదువుకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఉన్నంతలో తమ పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పిస్తారు. విద్యకు పెట్టే ఖర్చులో వెనుకంజ వేయరు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగానే పలువురు ఉద్యోగాలు సాధించారు.



**ఉన్నత స్థానంలో:** కర్నూలు జీజీహెచ్‌లో కార్డియాలజీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ ప్యాలకుర్తి వాసియే. ఆయన తండ్రి లక్ష్మణదాసు రిటైర్డ్ టీచర్. లక్ష్మణదాసుకు నలుగురు సంతానం. వారందరూ వివిధ రంగాల్లో ఉన్నారు. అలాగే నిరుడు ఐపీఎస్ సాధించిన షేక్ హబీబుల్లా తండ్రి, తాత ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే. ఈయన తండ్రి అబ్దుల్ ఖాదర్‌బాషా తెలంగాణలో ట్రాన్స్‌కో డీఈఈగా పని చేస్తున్నారు. తాత మహబూబ్ దౌలా రిటైర్డ్ టీచర్. గ్రామం నుంచి 14 మంది ఉపాధ్యాయులు, 13 మంది కానిస్టేబుళ్లు, ఆరుగురు ఎస్‌ఐలు, పది మంది డాక్టర్లు, ఒక తహసీల్దార్, ముగ్గురు వీఆర్వోలు, ఒక పంచాయితీరాజ్ ఇంజనీర్, బ్యాంకు ఉద్యోగులు ఐదుగురు, ఐదుగురు సచివాలయం, ఒక జిల్లా అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఒక ఆప్కో, ఏడుగురు ఆర్టీసీ, నలుగు ట్రాన్స్‌కో వంటి ప్రభుత్వ రంగాల్లో పని చేస్తున్నారు.

### చదువుతోనే పురోగతి

యువత కష్టపడి చదవాలి. మేము ఎంచుకున్న మార్గమే వారికీ లక్ష్యం కావాలి. సాధించగలననే ఆత్మవిశ్వాసం ఉంటే ఎవరికైనా విజయం దాసోహమవుతుంది. నిరంతర శ్రమ, కఠోర దీక్ష లక్ష్య సాధనకు ఆయుధాలు. చదువు అందరి సొత్తు. తల్లిదండ్రులు చదువే ఆస్తిగా చూపడంతో బాగా కష్టపడ్డాను. వైద్యరంగంలో కార్డియాలజీ చీఫ్, సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ హోదాల్లో రిటైర్డ్ అయి ప్రస్తుతం జీజీహెచ్ సీనియర్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాను. ఇంతటి పేరు, ప్రతిష్టలు రావడానికి చదువు గొప్పతనమేనని ఘంటాపథంగా చెబుతాను.

-డాక్టర్ చంద్రశేఖర్,
జీజీహెచ్ కార్డియాలజీ సీనియర్ ప్రొఫెసర్



### ఫెయిల్యూర్‌ను షూట్ చేయాలి

చదువు ఎన్నటికీ వృథా కాదు. లక్ష్యం ఏర్పరచుకుని ముందుకు సాగడం ఎంతో అవసరం. పోటీ పరీక్షల్లో ఫెయిల్యూర్ అయినంత మాత్రాన కుంగిపోవద్దు. తప్పిదాలను గుర్తించి సరిదిద్దుకోవడమే అతిపెద్ద విజయం. నేను ఇదే అనుసరించి 2023లో ఐపీఎస్‌కు ఎంపికయ్యాను. ఇటీవలే ఐపీఎస్ శిక్షణ కూడా పూర్తయింది. అనేక నేరాంశాల్లో లోతైన విషయాలు తెలుసుకున్నాం. ఫెయిల్యూర్స్‌ను షూట్ చేస్తే విజయం తప్పకుండా సొంతమవుతుంది.

- ఐపీఎస్ సాధించిన షేక్ హబీబుల్లా



### పిల్లలు కష్టపడి చదువుకున్నారు

మాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. నేను వ్యవసాయం చేస్తాను. నా భార్య కేశమ్మ కూరగాయలు విక్రయిస్తుంది. మాకు ఏడుగురు సంతానం. పెద్ద కుటుంబమైనా చదువు విలువ గుర్తు చేస్తూ పిల్లల్ని పెంచాను. మొదటి కుమారుడు సుధాకర్‌యాదవ్ ఎస్‌ఐ ఉద్యోగం సాధించి అనంతపురంలో పని చేస్తున్నాడు. రెండో అబ్బాయి మెడికల్ రెప్, మూడో వాడు పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నాడు. అమ్మాయిల్లో ఒకరు బ్యాంకు, మరొకరు సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నారు.

- గైరబోని హనుమంతు,
రైతు, ప్యాలకుర్తి

## రేపటి నుండి బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 6 నుంచి 17వ తేదీ వరకు బీఈడీ 1,2,3,4 స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 8 పరీక్షా కేంద్రాల్లో 277 మంది విద్యార్థులు పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు.

● **రేపటి నుంచి డిగ్రీ పరీక్షలు:** డిగ్రీ 1,2,3,4,5,6 సెమిస్టర్ల స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 6 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నట్లు రాయలసీమ యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 11 కేంద్రాల్లో 2,481 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

## 9 న జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల వివేకానంద ఆడిటోరియంలో 10వ జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ చిత్తలూరి రామ్‌ప్రసాద్, చింతలపల్లె కోటేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దివంగత యంఆర్ గోవిందరెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దివంగత ఆర్‌సీ కంబగిరి రాజు అవార్డు పేరుతో ఈనెల 9 వతేదీన 10వ జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా 2గ్రాముల బంగారు పతకం, 20గ్రాముల వెండి పతకం, 10గ్రాముల వెండి పతకం, ప్రశంసాపత్రం అందజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు చింతలపల్లి కోటేష్ సెల్‌నెంబర్ 9966639299, సీతారం ఆర్ట్స్ -9866760490 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# సముద్ర శాస్త్రవేత్త ఎంపీఎం రెడ్డి కన్నుమూత

- అంతర్జాతీయ ఖ్యాతి గడించిన జిల్లావాసి
- సముద్రశాస్త్రంలాగే సాహిత్యమూ ఆయనకు ఇష్టం


డాక్టర్ ఎంపీఎం రెడ్డి (ఫైల్ )

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ సముద్రశాస్త్రవేత్త డాక్టర్ ఎంపీఎం రెడ్డి (90) మంగళవారం నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన చికిత్స పొందుతూ కోలుకోలేక తుదిశ్వాస విడిచారు. ఉమ్మడి జిల్లాలోని కోవెలకుంట్ల సమీపంలోని సుద్దమళ్ల గ్రామ వాస్తవ్యులైన డాక్టర్ ఎం. మద్దులేటి రెడ్డి (ఎంపీఎం రెడ్డి) ఆంధ్రా యూనివర్శిటీ నుంచి సముద్రశాస్త్రంలో తొలి డాక్టరేట్ పట్టా పొందారు. కెనడా ప్రభుత్వం ఈయనను పోస్ట్ డాక్టరేట్ ఫెలోషిప్‌నకు ఎంపిక చేసింది. కెనడాలో ఉంటూ అక్కడి సముద్రతీరంలో అనేక పరిశోధనలు చేసి పత్రాలు సమర్పించి ఆ ప్రభుత్వం ప్రశంసలు పొందారు. అనంతరం గోవాలో సైంటిఫిక్ పూల్ అధికారిగా పనిచేస్తూ అరేబియా సముద్రంపై పరిశోధనలు చేశారు. మంగుళూరు కాలేజ్ ఆఫ్ ఫిషరీస్‌లో సుదీర్ఘకాల హెచ్‌ఓడీగా పనిచేశారు. దేశవ్యాప్తంగా వందలాది సముద్రశాస్త్ర విద్యార్థులకు మార్గదర్శిగా ఉండి వారి పరిశోధనలకు దోహదం చేశారు.

**ఏడు సముద్రాలు చుట్టువచ్చిన శాస్త్రవేత్త:** కెనడా ప్రభుత్వ ఆధ్వర్యంలో డాక్టర్ రెడ్డి ప్రపంచంలోని ఏడు సముద్రాలు చుట్టివచ్చారు. నెదర్లాండ్‌లోని బాల్కెమా పబ్లిషర్లు డాక్టర్ రెడ్డి రాసిన 'డిస్క్రిప్టివ్ ఫిజికల్ ఓషనాగ్రఫీ'ని ప్రచురించారు. యూఎస్‌ఏలోని సైన్స్ పబ్లిషర్లు 'ఓషన్ ఎన్విరాన్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్' అనే పుస్తకాన్ని ముద్రించారు. ప్రస్తుతం కేంబ్రిడ్జ్, జపాన్, జర్మనీలలోని యూనివర్శిటీలు డాక్టర్ రెడ్డి రచించిన ఓషనోగ్రఫీ గ్రంథాలు సముద్రశాస్త్ర విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ప్రచురించాయి. లండన్ లైబ్రరీలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రముఖుల పేర్లు ప్రచురించిన 'హూ ఈజ్ హూ' అనే పుస్తకంలో ఇండియా నుంచి పేర్కొనదగిన ప్రముఖుల్లో ఈయన ఒకరిగా పేర్కొన్నారు. సముద్రశాస్త్రం, సాహిత్యంపై 27 పుస్తకాలు రాశారు. తెలుగు కళా సమితి స్థాపించి అప్పటి గవర్నర్ పెండేకంటి వెంకటసుబ్బయ్య, నాటి రాష్ట్ర విద్యామంత్రి మండలి వెంకటకృష్ణారావుతో సాహితీ సభలు జరిపారు. విశ్రాంత జీవితంలో కర్నూలుకు వచ్చి తెలుగు కళా స్రవంతి స్థాపించి పలువురు రచయితలను, కవులను ప్రోత్సహించారు. తన స్వగ్రామం సుద్దమళ్ల గురించి 'మావూరి ముచ్చట్లు' పేరుతో పుస్తకం వేశారు.

**ప్రముఖుల నివాళి:** ఉమ్మడి జిల్లాకు గర్వకారణమైన శాస్త్రవేత్తగా డాక్టర్ రెడ్డి నిలిచిపోతారని, బనగానపల్లె అరుణభారతి సంస్థ వ్యవస్థాపకుడు బీసీ రాజారెడ్డి కొనియాడారు. డాక్టర్ రెడ్డి మృతి కళా సాహిత్య రంగాలకు తీరని లోటని గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కేసీ కల్కూర శ్లాఘించారు. ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన మహనీయుడుగా డాక్టర్ ఎంపీఎం రెడ్డి నిలిచిపోతారని తెలుగు కళా స్రవంతి కార్యదర్శి ఇనాయతుల్లా నివాళులు అర్పించారు. డాక్టర్ రెడ్డి రాసిన గ్రంథాలను ప్రపంచంలోని అన్ని యూనివర్శిటీల విద్యార్థులు పాఠాలుగా చదువుకుంటున్నారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య శ్లాఘించారు.

## రైతుకు రుణం సులువే..!



(5వ పేజీ తరువాయి)

ఇప్పటిదాకా ఒక ప్రాథమిక వ్యవసాయ సంఘం పరిధిలో 5 నుంచి 10 వేల మంది రైతులు ఉన్నారు. వీరందరికీ సంఘంలోని సీఈవోలు, వారి సిబ్బంది రుణాలు మంజూరు చేయాలన్నా, బకాయిలు సత్వరమే వసూలు చేయాలన్నా కష్ట సాధ్యమైపోతోంది. ఇకపై ఈ పరిస్థితులకు చెక్ పెట్టి రైతులకు చేరువలోనే సంఘాల ఏర్పాటు జరగాలని కేంద్రం నిర్ణయం తీసుకున్నట్లు నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 900కుపైగానే పంచాయతీలు ఉన్నాయి. కేంద్రం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రతి గ్రామ పంచాయతీలో ఒక మల్టీ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఏర్పాటు కాబోతోంది. దీని వల్ల రైతులకు అత్యంత చేరువలోనే సంఘం ఉండటం వల్ల రుణాల మంజూరు, బకాయిల చెల్లింపు వేగవంతమవుతుందని నాబార్డు అధికారులు చెబుతున్నారు. కంప్యూటీకరణ ప్రస్తుతం దాదాపు పూర్తయ్యే దశలో ఉంది. ఈ కార్యక్రమం పూర్తయిన వెంటనే గ్రామ పంచాయతీల్లో మల్టీ వ్యవసాయ పరపతి సంఘం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు.

### రుణాల మంజూరు ఇక సులభతరం



ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రుణాల మంజూరుతోపాటు బకాయిలు వసూలు చేసే విషయంలో ఆ సంఘాల సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రైతులకు కూడా రుణాలు సకాలంలో అందడం లేదు. సహకార సంఘాల్లో రుణాలు ఇవ్వడమే కాకుండా వారిని మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి గ్రామానికి ఒక మల్టీ వ్యవసాయ పరపతి సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. ప్రస్తుతం సంఘాల ఏర్పాటు సంబంధించి కంప్యూటరీకరణ దాదాపు పూర్తి కావచ్చింది. త్వరలోనే కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు కసరత్తును ప్రారంభించబోతున్నాం.

- నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి

## బాలోత్సవాలకు వేళాయే..!

- 6, 7 తేదీల్లో ఇండస్ పాఠశాలలో నిర్వహణ
- హాజరు కానున్న 2వేల మంది విద్యార్థులు



మాట్లాడుతున్న బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు జి.పుల్లయ్య

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో సృజనాత్మకత నైపుణ్యాలు వెలికితీసి సహజ మేధస్సును సమాజ నిర్మాణానికి అందించే లక్ష్యంతో బాలోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు జి.పుల్లయ్య తెలిపారు. మంగళవారం స్థానిక రవీంద్ర పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పిల్లల సందడి ఈ ఏడాది మొదలైందని తెలిపారు. కర్నూలులోని ఇండస్ పాఠశాలలో ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ బాలోత్సవ వేడుకలకు ఇండస్ పాఠశాల వేదికగా మూడు ప్రధాన వేదికల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి 2వేల మంది విద్యార్థులు వంద పాఠశాలల నుంచి పాల్గొంటున్నారని తెలిపారు. బాలోత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.శంకర్‌శర్మ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీసే క్రమంలో ఈ బాలోత్సవాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. శాస్త్రీయ సమాజ నిర్మాణ లక్ష్యంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కన్వీనర్ కెంగార మోహన్ మాట్లాడుతూ సృజనాత్మకత నైపుణ్యం, సహజ మేధస్సు నైతికతను పెంపొందించి విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలను వెలికితీసే ప్రయత్నమే బాలోత్సవాల నిర్వహణ అన్నారు. అసమానతలు లేని సమాజం, శాస్త్రీయమైన సమాజ నిర్మాణంలో విద్యార్థులను భాగస్వాములుగా చేయడమే లక్ష్యమన్నారు. ఇందులో అకడమిక్ కల్చరల్ ఈవెంట్లను నిర్వహిస్తున్నామనీ, వ్యాసరచన, వక్తృత్వపోటీలు, చిత్రలేఖనం, శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, దేశభక్తి గీతాలాపన వంటి 35 రకాల ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల యజమాన్యాల సంఘం జిల్లా అధ్యక్షుడు పీబీవీ సుబ్బయ్య, బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి జేఎన్ శేషయ్య, అకడమిక్ విభాగం కమిటి సభ్యులు కన్వీనర్ యుఆర్‌ఏ రవికుమార్, డి.ధనుంజయ, జంద్యాల రఘుబాబు, రంగస్వామి, రమాదేవి, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

## నందీశ్వర స్వామికి పూజలు



శ్రీశైలం(ఆత్మకూరు), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలోని నందీశ్వర స్వామికి, సుబ్రమణ్యస్వామి (కుమారస్వామి), బయలు వీరభద్రస్వామివారికి పూజలు చేపట్టారు. శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా దక్షిణ మాడవీధిలోని నిత్యాకళారాధన వేదికపై మంగళవారం మహానందికి చెందిన రామన్నగౌడ్ వారి బృందం నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

## దేవర పొట్టేలు రూ.1.10లక్షలు

మంత్రాలయం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని సూగూరు గ్రామంలో జరిగే దేవర మహోత్సవానికి సర్పంచ్ శంకరమ్మ భర్త లక్ష్మయ్య రూ.1.10లక్షలు పెట్టి పొట్టేలును కొనుగోలు చేశారు. బుధవారం జరిగే దేవమ్మ, మారెమ్మ అమ్మవార్ల దేవర కోసం కర్ణాటకలోని బ్యాడిగ నుంచి పొట్టేలును కొనుగోలు చేశాడు. దాదాపు 90 నుంచి 100 కేజీలు కలిగి ఉండే భారీ కొమ్ములు కలిగిన పొట్టేలు రూపాన్ని చూసి గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఒక్కొక్క ఇంటికి రెండు పొట్టేళ్ల ప్రకారం కొనుగోలు చేసినప్పటికీ దాదాపు అధిక ధరను వెచ్చించి కొనుగోలు చేసిన పొట్టేలును చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.


దేవరకు పొట్టేలును రూ.1.10 లక్షలు పెట్టి కొనుగోలు చేసిన సర్పంచ్ భర్త లక్ష్మయ్య

## విరసం 24వ సాహిత్య పాఠశాల

### 8, 9న కర్నూలులో

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విప్లవ రచయిత సంఘం (విరసం) ఆధ్వర్యంలో 24వ సాహిత్య పాఠశాలను 'సంక్షోభ కాలంలో సాహిత్యకారుల పాత్ర' అనే అంశంపై నిర్వహిస్తున్నారు. ఈనెల 8, 9 తేదీలలో నగరంలో గుత్తి పెట్రోల్ బంక్ పక్కనగల వెంకటేశ్వర కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసినట్లు విరసం నేత నాగేశ్వరాచారి తెలిపారు. ఇటీవల మరణించిన కవి, విప్లవ మేధావి, ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా స్మృతిపథంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. 8న ఉదయం 10.30 గంటలకు పతాక ఆవిష్కరణ, 11 గంటలకు అరుణ్ ఆహ్వానం, అరసవిల్లి కృష్ణ అధ్యక్షతన తొలి సమావేశం నిర్వహిస్తున్నారు. ప్రొఫెసర్ సాయిబాబా సహచరి వసంతకుమారి ప్రారంభోపన్యాసం చేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు శివరాత్రి సుధాకర్ అధ్యక్షత 'మేధో సృజనరంగాలపై ఫాసిస్టుల దాడి - కార్పొరేట్ ప్రయోజనాలు' అనే అంశంపై అల్లం రాజయ్య ప్రసంగిస్తారు. 3.30 గంటలకు 'సంక్షోభాన్ని ఎదుర్కొవడంలో రచయితల దృక్పథాలు, వైఖరులు' అనే అంశంపై ఉజ్వల్, సీఎస్‌ఆర్ ప్రసాద్ నిర్వహణలో కెంగార మోహన్ (సాహితీ స్రవంతి), రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి (అరసం), యాకూబ్, స్కైబాబ, మెర్సీ మార్గరెట్, సుభాషిణి, గుడిపాటి నిరంజన్, మహమూద్, వేంపల్లి షరీఫ్, ఏకే ప్రభాకర్, వైష్ణవి శ్రీ పాల్గొంటారు. సాయంత్రం సూర్యచంద్ర, ఉదయ్‌కిరణ్‌ల ఆధ్వర్యంలో కవి గాయక సభ ఉంటుంది. 9న ఉదయం 10 గంటలకు పుస్తక ఆవిష్కరణ, 11.30 గంటలకు వరలక్ష్మి అధ్యక్షతన 'తెలుగు సాహిత్యంలో వెలుగు నీడలు' అనే అంశంపై అరసవిల్లి కృష్ణ ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సాగర్ అధ్యక్షతన 'విప్లవోద్యమంపై ఫాసిస్టు యుద్ధం - రచయితలు, బుద్ధిజీవుల పాత్ర' అనే అంశంపై పాణి ప్రసంగిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు ఊరేగింపు, 5.30 గంటలకు జరిగే బహిరంగ సభకు కె. నాగేశ్వరాచారి అధ్యక్షత వహిస్తారు. వక్తలుగా జి. కళ్యాణరావు, శశికళ, ప్రొఫెసర్ హరగోపాల్, బొజ్జా దశరథరామిరెడ్డి ప్రసంగిస్తారు.

## దళితుల సమస్యలు పరిష్కరించాలి: కలెక్టర్


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జెసీ, తదితర జిల్లా అధికారులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కాలనీలో నూతనంగా ఎంపికైన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సందర్శించి షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ జాతులు, అణగారిన వర్గాల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జేసీ విష్ణు చరణ్, డీఆర్వో రామునాయక్, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, కమిటీ సభ్యులు బాలనాగన్న, నాగరాజు, కాశన్న, దేవదానం, రవికాంత్‌బాబు, రమేష్‌నాయక్, వెంకటేష్ నాయక్, నాగనవీన్, మురళి, సంబంధిత అధికారులు తదితరులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలను తెప్పించుకోవాలని సాంఘిక సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులను దాదాపుగా క్లియర్ చేశామన్నారు. సఫాయి కర్మచారులకు జీతభత్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.

### 'ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి'

నంద్యాల ఎడ్యుకేషన్: ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో రైతుల అవగాహన కోసం ఐదు మోడల్ ప్రాజెక్టులను ఎంపిక చేయాలని, ఇందులో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, హాస్టల్, రెండు మహిళా స్వయంసహాయక సంఘాలు సభ్యులుగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఉద్యానశాఖ అధికారి నాగరాజు, డీఆర్‌డీఏ పీడీ డైరక్టర్ శ్రీధర్‌రెడ్డి, డీపీఎం నరేంద్రారెడ్డి పాల్గొన్నారు.

## వాల్మీకి జేఏసీ చైర్మన్‌గా భవానీ ప్రసాద్



డైరీని ఆవిష్కరిస్తున్న డా. భవానీ ప్రసాద్

**కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** జిల్లా వాల్మీకి సంఘాల జేఏసీ చైర్మన్‌గా డా. భవానీ ప్రసాద్ నియమితులయ్యారు. మంగళవారం వాల్మీకి బోయ సేవా సంస్థ డైరీ-2025ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి బోయల ఎస్టీ పునరుద్ధరణ కోసం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని కలుస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ మహేష్ నాయుడు, బీవీఎస్ఎన్ వ్యవస్థాపకుడు, అధ్యక్ష కార్యదర్శులు కుబేరస్వామి, పెద్దయ్య, మల్లికార్జున, న్యాయవాదులు భాస్కర్, బేతం కృష్ణుడు, విష్ణు, కృష్ణమూర్తి, శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

## పారా అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థి



బషీర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్‌బాషా

**పెద్దకడుబూరు, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణ సమీపంలోని మహాయోగి లక్ష్మమ్మ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం బీకాం చదువుతున్న పంజారి బషీర్ పారా అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్‌బాషా తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన 7వ రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌లో పింజారి బషీర్ పాల్గొన్నారని తెలిపారు. 100మీటర్లు, 1500 మీటర్లు పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 17,18,19 వ తేదీల్లో చెన్నైలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థి బషీర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్‌బాషా, సూపరింటెండెంట్ మద్దిలేటి, శీను, బాబు, పీడీ సుధాకర్ అభినందించారు.

## జిల్లా పరిషత్‌లో పదోన్నతులు



సిబ్బందితో జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, సీఈవో నాసరరెడ్డి

**కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న ముగ్గురు టైపిస్టులు, ఎనిమిది మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం జిల్లా పరిషత్ పరిపాలన భవనంలో చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతులమీదుగా పదోన్నతుల ఉత్తర్వులను అందజేశారు. జిల్లా పరిషత్ పరిపాలన భవనంలో పని చేస్తున్న ముగ్గురు టైపిస్టులు శ్రీధర్‌కు ఆదోని పీఐయూ సబ్‌డివిజన్, ఎం.శ్యామలకు గోనెగండ్ల ఎంపీడీవో, బి.జ్యోతిప్రభకు, పీఐయూ డివిజన్ కర్నూలు, జూనియర్ అసిస్టెంట్లు వై.రవికాంత్‌రెడ్డికి తుగ్గలి ఎంపీడీవో, డి.భారతికి పీఆర్ఐ నంద్యాల డివిజన్, పి.కిరణ్‌ప్రసాద్ శర్మకు పీఐయూ కర్నూలు డివిజన్, బి.నాగరాజ కుమారికి పీఆర్ఐ ఆదోని డివిజన్ కార్యాలయానికి కేటాయించారు.

## థియేటర్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

**నందికొట్కూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని శ్రీరామ థియేటర్‌కు సంబంధించిన గోదాములో షార్ట్ సర్క్యూట్ జరిగింది. మంగళవారం పట్టణంలోని గోదాములో షార్ట్ సర్క్యూట్ జరగడంతో గోదాములో నిల్వ ఉన్న 900 కుర్చీలు కాలిపోయాయని యజమాని రామిరెడ్డి తెలిపారు. టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించి నష్టం విలువను అంచనా వేస్తున్నారు. గోదామును సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు పరిశీలించారు.



కాలిపోయిన కుర్చీలు

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఒకరికి తీవ్ర గాయాలు

**గూడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కె.నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఆగి ఉన్న లారీని బైకు ఢీకొనడంతో సురేష్(20) మృతి చెందగా, తిప్పక్క తీవ్రంగా గాయపడ్డారు. కె.నాగలాపురం ఎస్ఐ ఆశాలత తెలిపిన మేరకు వివరాలివీ.. దేవనకొండ మండలం కోటకొండ గ్రామానికి చెందిన సురేష్‌తో పాటు తిప్పక్క కె.నాగలాపురంలో అమ్మవారి దేవరకు వచ్చి తిరుగు పయనమయ్యారు. అయితే పెంచికలపాడు సమీపంలో కోడుమూరు వైపు రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి బైక్ ఢీకొట్టింది. బైక్‌పై వెళ్తున్న సురేష్ మృతి చెందాడు. తిప్పక్కకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బైకులు ఢీ.. వ్యక్తి మృతి

**కౌతాళం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఉరుకుంద-కౌతాళం గ్రామాల మధ్య మంగళవారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ వ్యక్తి ఘటన స్థలంలోనే మృతి చెందాడు. వివరాలు.. ఉరుకుంద గ్రామానికి చెందిన పూజారి వీరేష్(45) కూతురు జయశ్రీని కస్తూర్బా పాఠశాలలో వదిలేందుకు మంగళవారం బైకుపై వచ్చాడు. కుమారుడు రమేష్‌తో కలిసి స్వగ్రామానికి వెళ్తుండగా బదినేహాల్‌కు చెందిన మంగళి రవి మరో బైక్‌పై అతివేగంతో వచ్చి ఢీ కొట్టడంతో పూజారి వీరేష్ అక్కడిక్కక్కడే మృతి చెందాడు. కొడుకుకు తీవ్రగాయాలయ్యాయి. కాగా మరో ద్విచక్రవాహనదారుడు మంగళి రవి స్వల్పంగా గాయపడ్డాడు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు, కొడుకు ఉన్నారు. కౌతాళం సీఐ అశోక్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



మృతిచెందిన పూజారి వీరేష్ (ఫైల్)



గాయపడ్డ మంగలి రవి

# ట్రేడ్ లైసెన్సు చెల్లించం

- మద్యం వ్యాపారుల విముఖత
- నోటీసులు జారీ చేస్తున్న నగర పాలక అధికారులు






**కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** నగర పాలక సంస్థ ఆదాయానికి ట్రేడ్ లైసెన్సు ఒక మార్గం. అయితే ఏ వ్యాపారం చేసినా నగర పాలక సంస్థ నుంచి ట్రేడ్ లైసెన్సు తీసుకోవడంతో పాటు ప్రతి సంవత్సరం ఫీజు చెల్లించాలి. ఈ క్రమంలో నగర పాలక పరిధిలో 52 వార్డులు ఉండగా ఇందులో 27 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఒక్కో మద్యం దుకాణం సంవత్సరానికి రూ.10 వేల ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించాలి. దీని వల్ల నగర పాలక సంస్థకు సంవత్సరానికి రూ .2.70,000 ఆదాయం వస్తుంది. లైసెన్సు తీసుకొని ఫీజు చెల్లించాలని నగర పాలక అధికారులు దుకాణ యజమానులకు అడుగుతున్నారు. అయితే తాము ఒక్క పైసా కూడ చెల్లించబోమని, ఎక్సైజ్ అధికారులు చెల్లించకూడదని చెప్పారని వ్యాపారులు అంటున్నారు. ముఖ్యంగా లైసెన్సు ఫీజు చెల్లింపులపై వ్యాపారులు విముఖత వ్యక్తం చేస్తున్నారు.

**ఐదేళ్లపాటు ప్రభుత్వ దుకాణాల తీరు అంతే..**

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఐదేళ్ల పాటు ఒక్క దుకాణం కూడ ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించలేదు. దీని వల్ల నగర పాలక సంస్థ సుమారు రూ.13,50,000 నష్టపోయింది. నగరంలో ఉండే బార్ అండ్ రెస్టారెంట్లు మాత్రం సంవత్సరానికి రూ.25 వేల చొప్పున ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లిస్తున్నారు. మరి అలాంటప్పుడు మద్యం వ్యాపారులు ఎందుకు చెల్లించడం లేదని కొందరు ప్రశ్నిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణ యజమానులు ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లిస్తుండేవారని అధికారులు అంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటి దాకా దుకాణదారులు ట్రేడ్ లైసెన్సు తీసుకోవడం లేదు.

### ప్రజాప్రతినిధుల వద్దకు పంచాయితీ..

ట్రేడ్ లైసెన్సు ఫీజుల విషయం స్థానిక ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లింది. అయితే మద్యం దుకాణాలలో చాలా వరకు స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉంది. అందువల్లే ఎవ్వరూ లైసెన్సు తీసుకోవడం లేదు. దీని వల్ల నగర పాలక ఆదాయానికి గండి పడుతుందని తెలిసినా కూడ ప్రజాప్రతినిధులు వ్యాపారులను వెనుకేసుకుని రావడం బాగాలేదని కొందరు గుసగుసలాడుతున్నారు. కొందరు యజమానులు ఏకంగా మంత్రితోనే చెప్పిస్తామని, తాము ఫీజు కట్టాల్సిన పని లేదని తేల్చిచెబుతున్నారు. దీంతో అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితిలో ఉన్నారు.

**త్వరలో నోటీసులు ఇస్తాం**

నగర పాలక పరిధిలోని మద్యం దుకాణాలకు ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలని చెబుతూనే ఉన్నాం. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. త్వరలోనే దుకాణాలకు నోటీసులు జారీ చేస్తాం.

-డాక్టర్ కే. విశ్వశ్వరరెడ్డి, ప్రజారోగ్య అధికారి

**మా పరిధిలో లేదు**

ట్రేడ్ లైసెన్సు విషయం మా పరిధిలో లేదు. మేము ఎన్నడూ మద్యం దుకాణ యజమానులకు ట్రేడ్ లైసెన్సు చెల్లించవద్దని చెప్పలేదు. నగర పాలక అధికారులు నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్సు వసూలు చేసుకోవచ్చు. ఇతర శాఖలకు సంబంధించిన చెల్లింపులు ఉంటే మేము వద్దని చెప్పం.

- చంద్రహాస్, పట్టణ ఎక్సైజ్ సీఐ

# రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వాహనం

**ఆత్మకూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీ సులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు అర్బన్ సీఐ రాము మంగళవారం మాట్లాడుతూ.. ఆత్మకూరుకు చెందిన నగేష్, ఓర్వకల్లుకు చెందిన చాంద్‌బాషా ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లో ఇళ్ల వద్ద జనం నుంచి సేకరించిన సుమారు 2వేల కేజీలు (40ప్యాకెట్లు) రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా నంద్యాల టర్నింగ్ వద్ద స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ రేషన్ బియ్యాన్ని కర్నూలుకు తరలిస్తున్నట్లు తెలిపారు. వీటిని వివిధ హోటళ్లకు దోసెలు, ఇతర ఆహార పదార్థాల తయారీకీ వినియోగించేందుకు తీసుకెళ్తున్నట్లు నిందితులు చెప్పారని తెలిపారు. ఈ మేరకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ట్రాలీ వాహనంతో పాటు 40 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడిం చారు. కేసు నమోదు చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

## ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

ఆత్మకూరు పట్టణంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు అర్బన్ సీఐ రాము తెలిపారు. ఈ సందర్భంగా వారికి జరిమానాలు విధించినట్లు చెప్పారు. కాగా సొంత అవసరాలకు మాత్రమే ఇసుక తెచ్చుకోవాలని, తప్ప అనుమతులు లేకుండా విక్రయించకూడదని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## నిందితుడి అరెస్టు

- తుగ్గలి ఎస్ఐ క్రిష్ణమూర్తికి ఎస్పీ అభినందనలు



నిందితుడితో పోలీసులు

**తుగ్గలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** అనుమానంతో భార్య మహబూనిని కత్తితో పొడిచి హత్య చేసిన భర్త అక్బర్ వలిని అరెస్టు చేసిన తుగ్గలి ఎస్ఐ క్రిష్ణమూర్తిని ఎస్పీ అభినందించినట్లు పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన తుగ్గలి పోలీస్ స్టేషన్‌లో సోమవారం మండల పరిధిలోని రాతన కొత్తూరులో భార్యను హత్య చేసిన నిందితుడు అక్బర్ వలిని అరెస్టు చేసి సోమవారం డీఎస్పీ వెంకట్రామయ్య, సీఐ పులిశేఖర్‌గౌడు, ఎస్ఐ క్రిష్ణమూర్తి కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించి వివరాలు వెలడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకట్రామయ్య మాట్లాడుతూ హత్య జరిగిన 24 గంటల్లోనే నిందితుడిని ఎంతో చాకచక్యంగా పోలీసులు అరెస్టు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. నిందితుడు పరారవుతూ హత్యకు గురైన భార్య మహబూని ఫోన్‌ను తీసుకెళ్లడంతో ట్రాక్ చేసి తుగ్గలి పాత రైల్వేస్టేషన్ వద్దపోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలుసు కున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్ తుగ్గలి సీఐ పులిశేఖర్‌గౌడు, ఎస్ఐ క్రిష్ణమూర్తిలను అభినందించారన్నారు.

## గ్రామ యువకుడే దొంగ

- పోలీసుల అదుపులో నిందితుడు
- రచ్చుమర్రి చోరీ కేసులో రికవరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ, క్లూస్ టీమ్

**మంత్రాలయం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామంలో జరిగిన భారీ చోరీ కేసులో దొంగ ఆ గ్రామానికి చెందిన యువకుడే అని పోలీసులు తేల్చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని చాకచక్యంగా విచారించి డబ్బులు, బంగారు రికవరీ చేశారు. గత నెల 25వ తేదీన చోరీ జరిగినట్లు బాధితుడు శేషాద్రి శెట్టి ఫిర్యాదు చేయడంతో మాధవరం ఎస్ఐ విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. క్లూజ్ టీం ద్వారా వేలిముద్రల సేకరణ, డాగ్ స్క్వాడ్‌తో కొంత ప్రాథమిక సమాచారం లభించింది.

ఈ మేరకు కేసును ఛేదించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు, ఎస్ఐ విజయ కుమార్ చాకచక్యంగా నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా.. దొంగతనం తానొక్కడే చేసినట్లు ఒప్పుకున్నట్లు సమాచారం. ఆదోని, ఎమ్మిగనూరులో బంగారు గొలుసులు అమ్మినట్లు చెప్పడంతో పోలీసులు రికవరీ చేసినట్లు తెలిసింది. నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. చోరీకి పాల్పడిన వ్యక్తి 18 ఏళ్ల యువకుడని, గతంలో రెండు, మూడు పర్యాయాలు చోరీలకు పాల్పడినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. జల్సాలకు అలవాటు పడి, తాగుడుకు బానిసై దొంగతనాలు చేస్తున్నట్లు గ్రామంలో చర్చించుకుంటున్నారు.

## నందమూరి నగర్‌లో చోరీ

- మూడిళ్లలో విలువైన వస్తువులు, నగదు అపహరణ





చిందరవందరగా ఉన్న వస్తువులను చూపుతున్న బాధితురాలు... దొంగలు పగులగొట్టిన బీరువా వద్ద బాధితురాలు

**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** జిల్లా కేంద్రంలోని నందమూరినగర్‌లోని గొల్లపేట ప్రాంతంలో వరుసగా దొంగలు మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో ప్రజలు గాఢ నిద్రలో ఉండగా దొంగలు ఇళ్ల తలుపులు పగులగొట్టి లోపలికి చొరబడి చోరీకి తెగబడ్డారు. నంద్యాల పప్పులబట్టి బజారులోని శారద విద్యాపీఠం స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న వెంకటలక్ష్మి ఇంట్లోకి చొరబడి వెండి పూజా సామగ్రి దోచుకెళ్లారు. వీటి విలువ రూ.30వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. జహనాబీ అనే మహిళ ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువాలో ఉంచిన రెండు తులాల బంగారు గొలుసు, వెండికాళ్ల పట్టీలతో పాటు రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లారు. షేక్ రుక్సానా అనే మహిళ ఇంట్లో బీరువాను పగులగొట్టి అందులోని బంగారు ఉంగరం, వెండికాళ్ల పట్టీలు, రూ.15వేల నగదు ఎత్తుకెళ్లారు. నంద్యాల తాలుకా పోలీసులు వరుస దొంగతనాలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

**ఓర్వకల్లు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం మండలంలోని నన్నూరు గ్రామంలో రూ.24 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని, రూ.25 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని ఆమె ప్రారంభించారు. అలాగే రూ.10 లక్షల నిధులతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ఓర్వకల్లు మండలాన్ని కారిడార్ హబ్‌గా తీర్చిదిద్దారన్నారు. గ్రంథాలయ నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాత ఎద్దుల రాజేంద్రనాథ్ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో డీఈ నాగిరెడ్డి, ఎంపీడీవో శ్రీని వాసులు, ఏఈలు సురేంద్రనాథ్ రెడ్డి, శ్రీనివాసులు, ఏపీవో కుమార సాయినాథ్, ఎస్‌ఐ సునీల్ కుమార్, గ్రంథాలయ సెక్రటరీ ప్రకాష్, నాయకులు గోవిందరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, ఖాజామియా, విజయుడు, సర్కార్, సర్దార్ బేగ్, కృష్ణారెడ్డి, వడ్ల బాషా, మహ్మద్ బేగ్, పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రాక్టికల్స్‌లో దోపిడీని అరికట్టాలి



ఆర్‌ఐవోకు వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పేరుతో కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల్లో జరిగే దోపిడీని అరి కట్టాలని ఆర్‌ఐవో గురువయ్యశెట్టికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, కార్యదర్శి అబ్దుల్లా మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు కళాశాలల యజమాన్యాలు విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయించకుండా డబ్బులు వసూలు చేసి ఎగ్జామినర్లను మభ్యపెట్టి, వారికి డబ్బులు ఆశ చూపి విద్యార్థులకు మార్కులు పొందేలా చేస్తున్నారని ఆరోపించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఎస్ ఎఫ్ఐ నాయకులు ఉన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై ఆర్డీవో సమావేశం

**కర్నూలు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** కర్నూలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం ఇసుక అక్రమ రవాణపై ఆర్డీవో కిడారి సందీప్‌కుమార్ తహసీల్దార్, మైనింగ్, పోలీసు, భూగర్భ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కర్నూలు రూరల్ మండలం పరిధిలో సుంకేసుల, ఆర్‌కే దుద్యాల, ఎదురూరు, ఆర్.కొంతలపాడు గ్రామ సమీపంలో తుంగభద్రనది నుంచి పెద్దఎత్తున ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్డీవో ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు ఈ నాలుగు శాఖల అధికారులతో కమిటీ వేశారు. రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ప్రభుత్వం ఇదివర కే ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసిందని, అవసరం ఉన్నవారు ప్రభుత్వ ఇసుక రీచ్‌లోనే తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించారు. ప్రధానంగా సుంకేసుల డ్యామ్ దిగువ ప్రాంతంలో ఇసుక తవ్వకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు.

## కేసులు ఎత్తివేయాలి

**కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** జిల్లాకు యూనివర్సిటీ అడిగితే విద్యార్థి సంఘాల నాయకులపై కేసులు పెట్టారని, వాటిని ఎత్తివేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. మంగళశారం స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సోమన్న మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎదుట నిరసన వ్యక్తం చేయ గా.. పోలీసులు అత్యుత్సాహంతో విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారన్నారు. వారిపై పెట్టిన కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అభి, అశోక్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

**ఓర్వకల్లు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై సోమయాజులపల్లె బస్టేజీ వద్ద ద్విచక్ర వాహనాన్ని బొలేరో వాహనం ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. చెన్నంచెట్టిపల్లె గ్రామానికి చెందిన మామిడికాయల రంగస్వామి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న బొలేరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో మామిడికాయల రంగస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

**కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** వచ్చే నెల మార్చి 4, 5 తేదీల్లో కర్నూలులోని అంబేడ్కర్ భవన్‌లో జరిగే రిపబ్లికన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి మహేష్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కార్యాల యంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను కాపాడుదాం.. రాష్ట్రాన్ని రక్షించుకుందాం అనే అంశంపై కర్నూలులో రెండు రోజుల పాటు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మధు, లాలుబాయి, రవి, చిన్నబాషా, ప్రకాష్, పాల్గొన్నారు.

## సామాజిక సేవాలో అశోక కాలేజీ విద్యార్థులు

**కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అశోక ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారని ప్రిన్సిపాల్ నవీన్ తెలిపారు. మంగళవారం ఉలిందకొండ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అబ్దుల్ రజాక్, వలిబాషా, హెచ్ఎం లీలావతి పాల్గొన్నారు.



# ఘనంగా రథసప్తమి

**కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** నగరంలో సంకల్ బాగ్‌లోని హరిహర క్షేత్రంలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలోని వేంకటేశ్వర స్వామి వారికి, శ్రీదేవీ భూదేవీ అమ్మవార్లకు, సూర్య నారాయణ స్వామికి, ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఆలయంలో కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి 19వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు మంగళవారం స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. లోకకల్యాణం కోసం లక్ష్మీ కుబేర హోమం, రథ సప్తమిని పురస్కరించుకొని అరుణ హోమం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను అశ్వవాహనంపై ఆసీనింప జేసి నగర వీధుల్లో ఊరేగించారు. రాత్రి మహాహారతి ఇచ్చి ఊంజల సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, గౌరవాధ్యక్షులు సందేల్ చంద్రశేఖర్, చెరువు వెంకట దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి నాగులవరం రాజశేఖర్, ఇతర ప్రతినిధులు టీవీ రవిచంద్రశర్మ, శ్యామసుందరరావు, చల్లా నాగరాజశర్మ, సీఎస్ ప్రసాదరావు పాల్గొన్నారు.

● విద్య అంటే కేవలం ఉపాధి కోసమే కాకుండా, సమాజ హితానికి ఉపయోగపడే జ్ఞాన సముపార్జన చేయాలని గన్నవరం భువనేశ్వరి పీఠం పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ ఉద్బో. దించారు. మంగళవారం రథసప్తమి సందర్భంగా గుత్తిరోడ్డులోని ఇండస్- మాంటిస్సోరి పాఠశాల క్రీడాప్రాంగణంలో మూడు వేల మంది విద్యార్థులతో సామూహిక సూర్య నమస్కారాలు ఆచరింపజేశారు. కార్యక్రమంలో మాంటిస్సోరి, ఇండస్ పాఠశాలల అధినేతలు కేఎన్‌వీ రాజశేఖర్, డాక్టర్ కేఎన్‌వీ గాయని రాజశేఖర్, హెచ్ఎంలు మీనాక్షి విల్సన్, విల్సన్ అగస్టీన్, కిరణ్మయి, సీబీఎస్ఈ ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, యోగా మాస్టర్‌పి. శ్రీనివాసులు, గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, పాలాది సుబ్రహ్మణ్యం, టీటీడీ హెచ్‌డీపీపీ ఉమ్మడి జిల్లా కార్య నిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పాల్గొన్నారు.



స్వామి అమ్మవార్లకు ఊంజల సేవ చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

● బి.తాండ్రపాడులోని క్రైడో పాఠశాల్లో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ), క్రైడో పాఠశాల సం యుక్త ఆధ్వర్యంలో రథసప్తమిని ఘనంగా నిర్వహించారు. యోగా గురువు నాగరాజు సూర్య నమస్కారాలు, యోగాసనాలు విద్యార్థులతో ఆచరింపజేశారు. ఈ సందర్భంగా టీటీడీ హెచ్‌డీపీపీ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయులు నాగార్జున, నిర్మల, హసీనా, సాయిశ్రీ, శశికళ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని నెహ్రూనగర్‌లోగల పుట్టపర్తి సత్యసాయిబాబా మందిరంలో సూర్యభగవానుడి చిత్రపటానికి పూజలు నిర్వహిం చారు. అనంతరం ఆదిత్య హృదయం పారాయణం చేశారు. భక్తులచే సామూహిక సూర్యనమస్కారాలు ఆచరింపజేశారు. సత్యసాయి సేవా కేంద్రం నిర్వాహకుడు మాకా అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

● గుత్తిరోడ్డులోని సూర్య నారాయణ స్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు టీఎస్ రామకృష్ణ ఎమ్మెల్యే దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పూజలు చేస్తున్న గౌరు వెంకటరెడ్డి, గౌరు చరిత



ఇండస్ పాఠశాలలో సామూహిక సూర్య నమస్కారాలు

## గుండెపోటుతో ఏబీఎన్ కెమెరామన్ మృతి

### ● పలువురి సంతాపం



సురేంద్ర(ఫైల్)

**కర్నూలు క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు ఏబీఎన్ కెమెరామన్ సురేంద్ర (35) అలియాస్ చిన్న మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం తెల్లవారుజామున 7 గంటల ప్రాంతంలో తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన ఆయనను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉదయం 8:30 గంటలకు గుండెపోటుతో మృతి చెందాడు. సురేంద్రబాబుది కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామం. సురేంద్రకు భార్య నాగేశ్వరమ్మ, కూతురు హరిణి, కొడుకు ఆదిత్య సంతానం ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే పలువురు మీడియా ప్రతినిధులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

**పలువురి పరామర్శ :** సమాచార శాఖ డీడీ జయమ్మ నివాళులర్పించారు. ఐజేయూ జాతీయ సమితి సభ్యులు జి.కొండప్ప, కే.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఈఎన్ రాజు, గౌరవాధ్యక్షులు సుబ్బయ్య, గౌరవ సలహాదారుడు కృష్ణారెడ్డి కోశాధికారి అంజి, సహాయ కార్యదర్శి శివ, కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షుడు స్నేహల్, ఏపీజేఎఫ్ అధ్యక్షుడు రామకృష్ణ, కాంగ్రెస్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, బీసీ సంక్షేమ జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, గౌడప్ప సంఘం అధ్య క్షుడు సత్యన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఇతర నాయకులు చిన్న రామాంజనేయులు, సత్యనారాయణ, యూసుఫ్‌ఖాన్, సాగర్, విజయకుమార్, రాజశేఖర్, గంగాధర్, ఆసిఫ్, రిపోర్టర్లు ఆనంద్‌బాబు, నాగరాజు, కెమెరామన్ చెన్నయ్య, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ లక్ష్మన్నతో పాటు ఆంధ్రజ్యోతి సిబ్బంది నివాళులర్పించారు. కర్నూలు త్రీటౌన్ సీఐ శేషయ్య నివాళులర్పించి ఆర్థిక సాయం అందజేశారు. సురేంద్ర మృతికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు తమ సంతాపం వ్యక్తం చేశారు.

## తొలి దశలోనే కేన్సర్‌ను గుర్తించాలి



మాట్లాడుతున్న డాక్టర్ వసీం హసన్ రాజాషేక్

**కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** తొలి దశలోనే కేన్సర్‌ను గుర్తించి చికిత్స తీసుకోవాలని మౌర్య హాస్పిటల్‌కు చెందిన గ్యాస్ట్రో బెరియాట్రిక్ సర్జన్ డాక్టర్ వసీం హసన్ రాజాషేక్ అన్నారు. వరల్డ్ కేన్సర్ డే పురస్కరించుకుని గాయత్రీ ఎస్టేట్‌లోని మౌర్య హాస్పిటల్‌లో మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ కంచర్ల హరిప్రసాద్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గ్యాస్ట్రో ఇంటెస్టినల్ కేన్సర్లు అధికమయ్యాయన్నారు. 50 ఏళ్లు దాటిన వారు కుటుంబంలో కేన్సర్ చరిత్ర ఉన్నవారు కొల నోస్కోపి, ఎండోస్కోపి స్కీనింగ్ చేయించుకోవాలన్నారు.

## ఎన్‌సీడీ కింద కేన్సర్ పరీక్షలు

**కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** ఎన్‌సీడీ 30 కింద జిల్లా వ్యాప్తంగా 18 ఏళ్లు దాటిన వారందరినీ రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వారా కేన్సర్ పరీక్షలు ఇంటింటా నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ తెలిపారు. నగరంలోని గడ్డ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎంహెచ్‌వో పోస్టర్‌ను విడుదల చేశారు.

# స్టేట్ కేన్సర్ హాస్పిటల్‌లో అత్యాధునిక సేవలు

### జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

**కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** కేన్సర్ బాధితులకు స్టేట్ కేన్సర్ హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్యసేవలు త్వరలో అందుబాటులోకి రానున్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెట్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. వరల్డ్ కేన్సర్ డేను పురస్కరించుకుని స్టేట్ కేన్సర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన అవగా హన సదస్సులో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.చిట్టి నరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు, కేన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రజలు దూమపానం ఆల్కహాల్, జంక్ ఫుడ్స్‌తో దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ స్టేట్ కేన్సర్ హాస్పిటల్‌లో ప్రతి మంగళ, గురువారాల్లో ప్రత్యేకంగా ప్రివెంటివ్ అంకాలజి ఓపీ (222) నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేన్సర్ హాస్పిటల్ సీఎస్ ఆర్ఎంవో బి.హేమనళిని, కర్నూలు జీజీహెచ్ సీఎస్ ఆర్ఎంవో బి.వెంకటేశ్వరరావు, మెడికల్ అంకాలజిస్టు డాక్టర్ శివప్రసాద్, సర్జికల్ అంకాలజిస్టు డా.చైతన్యవాణి పాల్గొన్నారు.

● వరల్డ్ కేన్సర్ డేను పురస్కరించుకుని మంగళవారం స్టేట్ కేన్సర్ హాస్పిటల్‌లో డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్ కృష్ణ ప్రకాష్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మెడికల్ అంకాలజి విభాగంలో కీమోథెరపీ, సర్జికల్ అంకాలజి విభాగంలో కేన్సర్ శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని, త్వరలో రేడియేషన్ విభాగంలో లీనియర్ యాక్సలరేటర్ అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. కేన్సర్ హాస్పిటల్ సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ బి.హేమ నళిని, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వీఆర్ హాస్పిటల్‌లో కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్



మాట్లాడుతున్న డాక్టర్లు వాసురెడ్డి, వినీషారెడ్డి

**కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** వరల్డ్ కేన్సర్ డేను పురస్కరించుకుని మంగళవారం నగరంలోని ప్రకాష్‌నగర్‌లో ఉన్న మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో కేన్సర్ శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ సి.వాసురెడ్డి, ఫిజీషియన్ డాక్టర్ వినీషారెడ్డి ఉచిత కేన్సర్ స్కీనింగ్ క్యాంప్‌ను నిర్వహించారు. 200 మందికి కేన్సర్ స్కీనింగ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.వాసురెడ్డి మాట్లాడుతూ జంక్‌ఫుడ్స్ పర్యా వరణ కాలుష్యం, రసాయన మందులతో పండించిన ఆహార పదార్థాల ద్వారా కేన్సర్ ముప్పు పెరుగుతుందన్నారు. చిన్న వయస్సు లోనే పొగాకు ఉత్పత్తులను వాడుతుండటంతో నేటి కేన్సర్లు ఎక్కువవుతున్నాయని అన్నారు.

## హైకోర్టు జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

**కర్నూలు లీగల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, సాధన కమిటీ కన్వీనర్ కే.కపిలేశ్వరయ్య కోరారు. మంగళవారం అమరా వతిలో కమిటీ సభ్యులైన జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ బి.కృష్ణ మోహన్‌లను వారు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. న్యాయ మూర్తిని కలిసిన వారిలో స్థానిక యువ న్యాయవాది బీకే మురళి మోహన్ ఉన్నారు.

## వంద రోజుల లక్ష్యాల పురోగతిపై సమీక్ష

**కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** మూడో విడత వంద రోజుల లక్ష్యాల పురోగతిపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడతలో వంద రోజుల లక్ష్యాలను అన్ని శాఖలు పురోగతి సాధించాయన్నారు. అదే స్ఫూర్తితో మూడో విడత వంద రోజుల లక్ష్యాలను కూడా సాధించాలన్నారు. వ్యవసాయం, మార్కెటింగ్, ఉద్యాన, ఏపీఎంఐపీ శాఖల అధికారులు మార్కెటింగ్ సౌకర్యాల ఏర్పాటు, స్టోరేజీ పాయింట్స్, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సౌకర్యాలను పెంచేలా తగిన ప్రతిపాదనలను వారంలోపు అందజేయాలన్నారు. నాబార్డు నిధులతో చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మైనర్ ఇరిగేషన్ ఎస్ ఈని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు.

## పెద్దాసుపత్రి ఏడీగా మల్లేశ్వరమ్మ



మల్లేశ్వరమ్మను అభినందిస్తున్న సూపరింటెండెంట్

**కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా వై.మల్లేశ్వరమ్మ నియమితులయ్యారు. మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు సమక్షంలో ఏడీగా ఆమె బాధ్యతలు చేపట్టారు. కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ఏవోగా పని చేస్తున్న మల్లేశ్వరమ్మను మాడిఫికేషన్ ఆర్డర్స్‌తో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఏడీగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాలు జారీ చేశారు. శ్రీశైలానికి చెందిన మల్లేశ్వరమ్మ 1984లో కర్నూలు జీజీహెచ్‌లో టైపిస్టుగా తొలిసారిగా ఉద్యోగంలో చేరారు. మళ్లీ ఇప్పుడు అదే ఆసు పత్రిలో ఏడీగా పదోన్నతిపై రావడం విశేషం. కొత్త ఏడీకి ఆసుపత్రి సూపరింటెండెంట్, సీఎస్ఆర్ఎంవో ఏవో శ్రీనివాసులు, ఆఫీసు సూపరింటెండెంట్ లతీఫ్ బేగ్ అభినందనలు తెలిపారు.

# కోట్ల సమక్షంలో టీడీపీలో చేరిక



కోట్ల సమక్షంలో చేరిన కున్నూరు లింగన్న తదితరులు

**కోడుమూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** కోడుమూరు, గోనెగండ్ల, దేవనకొండ మండలాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. గోనెగండ్ల మండలం కున్నూరు గ్రామం మాజీ సర్పంచు భర్త ఎరుకలి లింగన్నతో పాటు కోడుమూరు, గోనెగండ్ల, దేవనకొండ మండలాలకు చెందిన మరో 200 మంది వైసీపీ కార్యకర్తలు కర్నూలులోని కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి నివాసంలో టీడీపీలో చేరారు. వీరికి కోట్ల టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లింగన్న మాట్లాడుతూ కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ పార్టీ బలోపేతంకు శక్తి వంచన లేకుండా పని చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పెద్దనెలటూరు పరమేశ్వరరెడ్డి, మాజీ సర్పంచు రాంబాబు, టీడీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, హేమాద్రిరెడ్డి పాల్గొన్నారు.

**అన్నదానాన్ని ప్రారంభించిన కోట్ల:** తుమ్మిళ్ల వెంకట్రామిరెడ్డి ఆరాధనోత్సవం సందర్భంగా డోన్ ఎమ్మెల్యే కోట్లజయసూర్యప్రకా శ్‌రెడ్డి మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముం దుగా తుమ్మిళ్ల వెంకట్రామిరెడ్డి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో మాజీ సర్పంచు కేఈ రాంబాబు, సీబీలత టీడీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, హేమాద్రిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి

**కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగిం చాలని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ ప్రతినిధులు కోరారు. మంగళ వారం ఎస్వీ కాంప్లెక్స్‌లో వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకుడు హనుమంత రెడ్డి మాట్లాడుతూ ఏపీలోని నాలుగు గ్రామీణ బ్యాంకులు కలిసి ఒకే గ్రామీణ బ్యాంకుగా ఏర్పడుతు న్నందున కడపలోనే ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం ఎస్వీ మాట్లాడుతూ ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గౌతమ్, పి.సు రేష్, ఏ.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంసీవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఏపీ ఎన్జీవోస్ నాయకులు

**కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. బెస్ట్ ఎలక్టోరల్ అవార్డు పొందిన కలెక్టర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా కార్యదరిశ కేసీహెచ్ కృష్ణుడు, నగర అధ్యక్షులు ఎంసి కావన్న, నగర కార్యదర్శి రామకృష్ణ, టైపిస్టు అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈ.మద్దిలేటి, జిల్లా కార్యదర్శి బాస్కర్ రెడ్డి, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ మహిళావిభాగం చైర్మన్ చందన, ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బంగారి, ఏపీ ఫార్మాసిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షు కార్యదర్శులు రంగస్వామి, రాజేష్, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారం

**గూడూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని సింగనగేరి గజ్జలమ్మ కాలనీలో కొత్త బోరు వేయడంతో తాగునీటి సమస్య పరిష్కారమైందని టీడీపీ కో ఆప్షన్ సభ్యుడు పుట్టపాశం రామాంజనేయులు అన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని సింగనగేరి గజ్జలమ్మ కాలనీలో కొత్త బోరుకు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ సింగనగేరి గజ్జలమ్మ కాలనీలో నెలకొన్న నీటి సమస్యను జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే బోరు వేయించి కాలనీలో నీటి సమస్యను పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్ణ, నాయుడు, బాబు, శ్రీను పాల్గొన్నారు.

## క్రైస్తవుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఈటేల స్వామిదాస్

**కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** క్రైస్తవుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటేల స్వామిదాస్ అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం వైసీపీ కీలక నేతలు ఓ సమావేశంలో నారా చంద్రబాబు నాయుడు క్రైస్తవులకు చేసింది ఏమిలేదని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు క్రైస్తవుల కోసం అనేక సం క్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. 2014-19 మధ్యలో అప్పటి సీఎం చంద్రబాబు గుంటూరు, విజయవాడ సమీపంలో క్రిస్టియన్ భవన్ ఏర్పాటుకు రెండు ఎకరాల స్థలం కేటాయించి, రూ. 10 కోట్లు నిధులు విడుదల చేశారని తెలిపారు. 80 శాతం పూర్తి అయిన క్రిస్టియన్ భవన్‌ను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలిపి వేసిందని మండి పడ్డారు. బడ్జెట్ సమావేశాల్లో క్రైస్తవుల అభివృద్ధికి రూ.150 కోట్ల నిధులు ప్రవేశపెట్టారని తెలిపారు. క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబురాజు, జిల్లా అధ్యక్షుడు నెహెమ్యా, రాష్ట్ర కార్యదర్శి ఆదాం, సెక్రటరీ నాగరాజు, ప్రసాదరావు, నంద్యాల సుందరావు, అజయ్‌కుమార్, రూబెన్ పాల్గొన్నారు.

## దేవనకొండ ఈవోఆర్డీపై చర్యలు తీసుకోవాలి



డీపీవోకు ఫిర్యాదు చేస్తున్న ఎరుకల రాజు, కరుణాకర్

**కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** దేవనకొండ ఈవో ఆర్డీ సూర్యనారాయణపై చర్యలు తీసుకోవాలని ఎరుకుల హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి ఎరుకలి రాజు, జనసేన నాయకులు కరుణాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం డీపీవో కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కదిరికొండ పంచాయతీ సెక్రటరీ అయిన మహిళపై ఈవో ఆర్డీ సూర్య నారాయణ మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు.

# అదుపు లేని వాహనాలు



ఆదివారం డివైడర్ పైకి ఎక్కిన బస్సు (ఫైల్)

- ఆలూరు ప్రధాన రహదారిపై వేగంగా వాహనాల రాకపోకలు
- రోడ్డుకు అడ్డంగా వ్యాపారాలు
- వ్యాపారులను మార్కెట్‌కు తరలించాలంటున్న ప్రజలు

**ఆలూరు పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉంది. రోడ్డుపక్కనే వ్యాపారాలు చేస్తున్నారు. దీనికితోడు కండీషన్‌లో లేని ప్రైవేటు బస్సులు, వయస్సు మీరిన డ్రైవర్లతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.**

**ఆలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో ఆదివారం డ్రైవరుకు గుండెపోటు రావడంతో బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని, దానిపైకి ఎక్కింది. అయితే ప్రాణ నష్టం కలగలేదు. అయితే ప్రమాదం పట్టణంలోనే సంభవించి ఉంటే భారీగా ప్రాణ నష్టం ఉండేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

**అధికారులు మేల్కోవాలి..**

ఆదివారం జరిగిన బస్సు ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ, పోలీసులు అధికారులు మేల్కొనాలని ప్రజలు కోరుతున్నారు. రహదారి ఆక్రమించిన వ్యాపారులను సంత మార్కెట్‌లోకి తరలిం చాలని, అధికారులు సమన్వయంతో పనిచేయా లని అంటున్నారు.

**వయస్సు మళ్లిన డ్రైవర్లు, కాలం చెల్లిన బస్సులు**

ఆదివారం గుండెపోటుతో మృతిచెందిన ప్రైవేటు బస్సు డ్రైవర్ ఉసేన్ సాబ్‌కు 64ఏళ్లు ఉన్నాయి. అలాగే బస్సులు కూడా కండీషన్‌లో ఉండవని ఆరోపణలు ఉన్నాయి. ఈ మార్గంలో ఆదోని-బళ్ళారి, కర్నూలు-బాళ్ళారి బస్సులు వందలాదిగా రాకపోకలు సాగిస్తుంటాయి. కర్ణాటక, ఆంధ్రకు చెందిన ప్రైవేటు, బస్సులు 30కు పైగానే ఉన్నాయని తెలుస్తోంది. అలాగే ఇక్కడి నుంచి ఎమ్మిగనూరుకు కూడా బస్సు సర్వీసులు నడుపుతున్నారు. ఇందులో కొన్ని కాలం చెల్లిన బస్సులు ఉన్నాయి. ప్రైవేటు బస్సుల యజమానులు వయసు మళ్లిన వారిని డ్రైవర్లుగా పంపుతుండటతో ప్రయాణికులు ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోంది. ఇంత జరుగుతున్నా రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా మేల్కొని బస్సుల కండీషన్‌ను తనిఖీ చేసి, కాలం చెల్లిన బస్సు సర్వీసులను సీజ్ చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**రోడ్డు పక్కనే వ్యాపారాలు**



పాత బస్టాండ్‌లో ప్రధాన రహదారి పక్కన పండ్లు, పూలు, ఆకుకూరల వ్యాపారాలు సాగిస్తున్నారు. జాతీయ రహదారి కావడంతో బళ్ళారి, గుంతకల్‌కు ఈ మార్గం మీదుగా వేగంతో వందలాది వాహనాలు తిరుగుతున్నాయి. అదుపుతప్పితే బారీ ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది.



**వ్యాపారులను సంతలోకి తరలించాలి**

రోడ్డుకు అడ్డంగా ఉన్న వ్యాపారులను సంతలోకి తరలించాలి. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేస్తే ఉపయోగం లేదు. రైతు బజార్ ఏర్పాటు చేస్తే వ్యాపారులు అక్కడి వెళ్లే అవకాశం ఉంది.

**- రవీంద్ర రావ్, బీజేపీ నాయకుడు, ఆలూరు**



**వ్యాపారులను సంతకు తరలిస్తాం**

ఆలూరులో మూడు రోజుల క్రితం జరిగిన బస్సు ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డు పక్కన వ్యాపారులను సంత మార్కెట్‌లోకి తరలిం చేందుకు చర్యలు తీసుకుం టాం. పోలీసుల సాయం కోరతాంచ ఇందుకు వ్యాపారులు కూడా సహకరించాలి. జాతీయ రహదారి కావడంతో బస్సులు వేగంగా వచ్చే అకాశం ఉంది. ఈ విషయంలో చర్యలు తీసుకుంటాం.

**- వీరభద్రప్ప, డీఎల్‌పీవో, పత్తికొండ డివిజన్**

## మరుగుదొడ్లు పూర్తి చేయాలి

**హాలహర్వి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీవో వరలక్ష్మి సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇంకుడు గుంతల పనులను వేగవంతం చేయాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో ఆర్‌డబ్ల్యూఎస్‌ఏఈ వెంకటరమణి ఉన్నారు.

## లక్ష డప్పులతో గళం వినిపిస్తాం



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

**ఆలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** ఈనెల 7న హైదారాబాద్‌లో లక్ష డప్పులతో తమ గళం వినిపిస్తామని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పోస్టర్లను విడుదల చేశారు.ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం వేగవంతం చేయాలని, మాదిగ ఉపకులాల సమస్యలను పరిష్కరించాల న్నారు. దాదాభాయ్, బి మల్లయ్య, రాజన్న, ఎంపీటీసీ మల్లికార్జున, సుధాకర్, గంగాధర్, ఎం శేకన్న, ఉచ్చీరంగ పాల్గొన్నారు.

## చెరువులను ఆక్రమిస్తే చర్యలు



వంకను పరిశీలిస్తున్న ఏఈ

**వెల్దుర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** చెరువులు, వంకలను ఆక్రమిస్తే వాల్టా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మైనర్ ఇరిగేషన్ ఏఈ రవినాయక్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని లక్ష్మీనగరం, వెల్దుర్తి గ్రామాల చెరువులు, వంకలను పరిశీలించారు. ఆక్రమిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో పరిశీలించామని తెలిపారు.

## కందులన్నింటినీ కొనుగోలు చేస్తాం




కందులను కొనుగోలు చేస్తున్న అధికారులు

**మద్దికెర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** మండలంలో రైతులు పండించిన కందులన్నింటినీ కొనుగోలు చేస్తామని ఏవో రవి, కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధికారి రామకృష్ణ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'కందులను కొనేదెప్పుడు?' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు మంగళవారం కందులను కొనుగోళ్లను ప్రారంభించారు. మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ప్రభుత్వ ధర కింటాలుకు రూ.7,550ల ప్రకారం కొనుగోలు చేస్తామన్నారు. కందులు నాణ్యత లేకుంటే మార్క్‌ఫెడ్ అధికారులు తీసుకోరని, రైతులు కందులను శుభ్రం చేసుకుని కొనుగోలు తరలించాలని కోరారు. ఎంపీటీసీ కాల్వ రామకృష్ణ, మండల వైసీపీ ఉపాధ్యక్షుడు కృష్ణా యాదవ్, సిబ్బంది కవిత, జాకీర్ ఉన్నారు.

## గణిత పోటీల్లో ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఉపాధ్యాయులు

**ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** జిల్లా స్థాయి అబాకస్ గణిత పోటీలలో మిల్టన్ గ్రామర్ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచారని పాఠశాలి కరస్పాండెంట్ రమేష్ బాబు తెలిపారు. మంగళవారం పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ముజామిల్, హిమవర్షలకు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ నాగరాజు, సీఈవో వెంకటేశులు, వైస్ ప్రిన్సిపాల్ రంగస్వామి, ఉపాధ్యాయులు ఉమర్ వలి, జయసింహా, సుశీల, లావణ్య పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుడి మృతి



రామచంద్ర (ఫైల్)

**మద్దికెర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని బొజ్జనా యునిపేట గ్రామానికి చెందిన విద్యుత్ కార్మికుడు రామచంద్ర (46) మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఎస్ఈ ఉమాపతి సంతాపం తెలిపారు. సంఘం నాయకుడు రామచంద్ర కుటుంబానికి రూ.72వేల ఆర్థిక సాయం అందజేశారు.

## వ్యక్తి ఆత్మహత్య

**ఆదోని రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** మండలంలోని నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన సిద్దప్ప ఆత్మహత్యకు పాల్పడినట్లు హెడ్‌కానిస్టేబుల్ బషీర్ తెలిపారు. వివరాల మేరకు.. మద్యానికి బానిసగా మారి 20రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కుటుంబ కారణాలు, అనారోగ్య రీత్యా సోమవారం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి ఆదోని ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య ఈరమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## మ్యాన్‌హోల్‌కు ఇనుప గేటు ఏర్పాటు

**దేవనకొండ,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** స్థానిక వడ్డేగేరిలో కాలువపై ప్రమాదకరంగా వున్న మాన్‌హోల్‌పై జనసేన నాయకులు ఇనుప కడ్డీలను ఏర్పాటు చేశారు. కాలువలపై గోతులు ఉన్నాయని, ప్రమాదాలు జరగకుండా చూడాలని జనసేన నాయకులు అధికారులను కోరారు. ఉచ్చీరప్ప, రామాంజినేయులు, గోవింద్ పాల్గొన్నారు.

## రీ సర్వే పకడ్బందీగా చేయాలి : సబ్ కలెక్టర్

**హోళగుంద, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** రీ సర్వే పకడ్బందీగా చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నికైన పెద్దహ్యట గ్రామంలో రీ సర్వేను మంగళవారం పరిశీలించారు. సచివాలయం, తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేశారు. వీఆర్వోలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేని పక్షంలో కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ నిజాముద్దీన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, మండల సర్వేయర్ (ఇన్‌చార్జి) శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.



వీఆర్వోలతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ భరద్వాజ్

## కళ్యాణ వైభోగమే..

- సంతేకుడ్లూరులో ఒకటైన 14 జంటలు

**ఆదోని రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని సంతేకుడ్లూరు గ్రామంలోని మంగళవారం చెన్నకేశవ స్వామి ఆలయంలో సామూహిక వివాహాలు నిర్వహించారు. 14 జంటలు ఒకటయ్యాయి. ముందుగా సీతారాముల కళ్యాణం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. టీడీపీ నాయకులు ఉమాపతి నాయుడు, ఎంపిపి బడాయి దానమ్మ, మాజీ ఎంపిపి బడాయి పొంపాపతి తదితరులు ఆశీర్వదించారు.



వధూవరులతో పెద్దలు

## ఎంపీటీసీల గైర్హాజరు.. సమావేశం వాయిదా



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

**తుగ్గలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** మండల సర్వ సభ్య సమావేశానికి ఎంపీటీసీలు గైర్హాజరవడంతో వాయిదే వేస్తున్నట్లు ఎంపీడీవో విశ్వమోహన్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీపీ ఎర్రనాగప్ప అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావే శానికి ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాలేదు. మొత్తం మొత్తం 17 మంది ఎంపీటీసీలు, ఒక కోఆప్షన్ మెంబరు ఉండగా అందరూ వైసీపీ మద్దతుదారులే. పార్టీలోని అంతర్గత విబేధాలలే కారణమని సమాచారం. అధికారులు అందరూ హాజరు కాగా, సర్పంచులు కొందరే వచ్చారు. దీంతో ఎంపీడీవో మధ్యాహ్నం వరకు ఎదురు చూసి బుధవారానికి వాయిదా వేశారు. తహసీల్దార్ రమాదేవి, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్ పాస్ నిర్మించాలి

**ఆదోని, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని వేదారిగేరి వద్ద రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. ఈమేరకు ఎస్‌సీఆర్ జీఎంకు విన్నవించినట్లు తెలిపారు. మార్కెట్ యార్డుకు వెళ్లే హమాలీలు రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రెండో ముంబైగా పేరున్న ఆదోని మీదుగా రాయ చూరు-కాచిగూడ వయా ఆదోని మీదుగా, రాయచూర్ టు గద్వాల రైలును ఆదోని మీదుగా గుంకల్ వరకు పొడిగిం చాలన్నారు. వాస్కోడిగామా రైలును నిలుపుదల చేయాలని కోరినట్లు తెలిపారు. జీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

## మఖ్దుమ్ మోహియుద్దీన్ జయంతి

**పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో మంగళవారం కవి, ఎస్టీయూ వ్యవస్థాపకుడు కామ్రేడ్ మక్దుమ్ మొహిద్దీన్ 117వ జయంతి నిర్వహించారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో చిత్రపటానికి ఎస్టీయు రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి నివాళి అర్పించారు. స్వాతంత్ర తెలంగాణ సాయుధ పోరాటాల్లో తన రచనతో ప్రజలను మేలుకొల్పి ఉద్యమాలవైపు నడిపించారని అన్నారు. ఉపాధ్యాయ సమస్యల సాధనకై, విద్యారంగ పరిరక్షణకై ఎస్టీయూను స్థాపించారన్నారు. బలరాముడు, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పోరాటాలకు సిద్ధం కావాలి

**ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం నెహ్రూ పాఠశాలలో ఎస్టీయూ వ్యవస్థాపకుడు మగ్దూమ్ మోహియుద్దీన్ జయంతి నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు రవి ప్రధాన కార్యదర్శి భీమ్రాజు, లోక్యానాయక్, సుధాకర్, సతీష్‌ప్రసాద్, మారయ్య, జంబులయ్య పాల్గొన్నారు.

## ఘనంగా రథసప్తమి



ఆదోనిలో శ్రీనివాస కల్యాణోత్సవం

**ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుమల నగర్ వెంకటేశ్వర ఆలయం, ఆంజనేయ ఆలయాల్లో శ్రీనివాసుడికి భూదేవి శ్రీదేవిలా సమేత కళ్యాణం కమిటీ చైర్మన్ ఈరన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పల్లకిలో ఊరేగించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

**ఆలూరు రూరల్:** పట్టణంలోని కోటవీధిలో భీమలింగేశ్వర స్వామి ఆలయంలో మాలధారుల ఆధ్వర్యంలో మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉయదం పంచామృతశేకం బిల్వార్చన, సహస్ర శతనామావళి, జలాభిశేకం, శివదీక్ష మాలధరణ, మహ మంగళ హరతి వంటి ప్రత్యేక పూజలను అర్చకుడు మల్లికార్జున, ఎర్రిస్వామి, సతీష్ చేశారు.

## క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్ విడుదల చేస్తున్న వైద్యులు

**పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరు క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కల్పన సూచించారు. మంగళవారం క్యాన్సర్ డే సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. క్యాన్సర్ నివారణ చర్యలపై పోస్టర్లను విడుదల చేశారు. ఆహార నియామాలు పాటించాలని, మద్యం, సిగరెట్లుకు దూరంగా ఉండాలని కోరారు. తొలి దశలోనే గుర్తిస్తే వ్యాధి నయమయ్యే అవకాశం ఉందన్నారు.

## సౌత్ జోన్ కబడ్డీలో ప్రతిభ



ప్రతిభ చాటిన ఫిలిప్స్ కబడ్డీ టీం

**ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** సౌత్ జోన్ కబడ్డీ పోటీల్లో ఆదోని పిలిప్స్ కబడ్డీ టీం ప్రతిభ కనబరచిందని, అమర్ ప్రకాష్, రామాంజి, జయరాం తెలిపారు. చిత్తూరు జిల్లా తుంబూరులో 40 టీంలు పాల్గొనగా, వాటర్ ఫైనల్‌పై తమిళనాడు జట్టుపై గెలిచిందన్నారు. సెమీఫైనల్‌లో చిత్తూరు జట్టుపై విజయం సాధించి 4 స్థానంలో నిలవడంతో రూ.15వేలు నగదు పొందినట్లు తెలిపారు. క్రీడాకారులను సభ్యులు నాగరాజు, గోపి, దుబ్బా రవి రాజు, గోవిందు, ఎల్లప్ప అభినందించారు.

## ప్రభుత్వ స్థలాలను గుర్తించండి

**ఆదోని రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ప్రభుత్వ స్థలాలను, భూములను గుర్తించాలని తహసీల్దార్ శివరాముడు ఆదేశించారు. మంగళవారం వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలాలను కాపాడాలన్నారు. నోటీసు బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించాలన్నారు. డీటీ గుండాల నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

## గ్రోత్ సెంటర్లుగా పత్తికొండ, ఆలూరు పంచాయతీలు

- రూ. 2కోట్లతో ప్రతిపాదనలు: డీఎల్‌పీవో

**ఆలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** పంచాయతీలకు ఆదాయం సమకూర్చేందుకు ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద పత్తికొండ, ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీలను గ్రోత్ సెంటర్లుగా ఎంపిక చేసినట్లు డీఎల్‌పీవో వీరభద్రప్ప తెలిపారు. మంగళవారం పంచాయతీలో మాట్లాడుతూ పట్టణంలోని భాస్కర్ సత్రం లీజు గడువు ఏప్రిల్‌లో ముగుస్తుందని తర్వాత ప్రభుత్వం నిర్ణయించిన అద్దె ఏడాది పాటు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఆ ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు. సంత మార్కెట్ దుకాణాల్లో వ్యాపారులు చేరకపోతే ఏప్రిల్‌లో మరోసారి వేలం వేసి ఇతరులకు కేటాయిస్తామన్నారు. బస్సు ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యాపారులను సంత మార్కెట్‌లోకి తరలిస్తామన్నారు. ఇందుకోసం పోలీసుల సహకారం తీసుకుం టామన్నారు. పన్ను చెల్లించని మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈవో ప్రభాకర్ రావ్ ఉన్నారు.

## 9న వైద్య శిబిరం

**ఆదోని, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** ఈనెల 9న అవోపా, వామ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆవోపా మాజీ అధ్యక్షడు కాకుబాల్ నగేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. వెంకటేశ్వర్లు, ప్రతాప్, ఈరన్న శెట్టి, కప్పా రాజేష్, రాధాకృష్ణ, రత్నయ్య, వంకధార్ మమతా, సంగీత శ్రీదేవి, గీతా, హిమబిందు, సంతోషి పాల్గొన్నారు.

## విధుల్లోకి తీసుకోవాలని నిరసన

**ఆలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** అధికారులను బ్లాక్ మెయిల్ చేసిన వారికి ఉద్యోగమిచ్చి తనను తొలగించారని మోడల్ హాస్టల్ మాజీ చౌకీదార్ బూర్ల సుశీల ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. గతేడాది విధుల్లో చేరిన లక్ష్మీదేవి పని చేతకాక నెలకే రాజీనామా చేసిందన్నారు. 15 రోజులకు ఉద్యోగం తనకు ఇవ్వాలని కోరినా జిల్లా అధికారులు ఆమెను తొలగించారని తెలిపారు. అనంతరం తనను తీసుకున్నారని, అనంతరం విధుల నుంచి ఎందుకు తప్పించారో తెలియడం లేదో తెలియజేయాలని కోరారు. అధికారుల స్పందించి తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## పేదల పక్షపాతి కామ్రేడ్ అయ్యన్న

**పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** కామ్రేడ్ అయ్యన్న పేదల పక్షపాతి అని, పందికోన గ్రామంలో పెత్తందారుల విధానాలను వ్యతిరేకించి ప్రజలకు స్వేచ్ఛావాయువులు కల్పించారని సీపీఐ కార్యవర్గ సభ్యుడు, మండల కార్యదర్శి రాజాసాహెబ్ పిలుపునిచ్చారు. మంగళవారం కామ్రేడ్ అయ్యన్న పదో వర్ధంతి సందర్భంగా పందికోన గ్రామంలో ర్యాలీ నిర్వహించి, నివాళి అర్పించారు. నబీ రసూల్, మద్దిలేటి శెట్టి, కారన్న, కృష్ణ, రంగన్న, టీడీపీ నాయకుడు కడవల ఖాసిం, కడవల సుధాకర్ పాల్గొన్నారు.

## కూలీలను తరలించాలి

**దేవనకొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** మండలంలో ఉపాధి పనులకు కూలీలను తరలించాలని ఏపీవో రాజునాయక్ సూచించారు. మండలంలోని పి.కోటకొండలో మంగళవారం ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలు వలస వెళ్లకుండా పనులకు వచ్చేలా ఫీల్డ్ అసిస్టెంట్లు వారికి అవగాహన కల్పించాలన్నారు. కొలత ప్రకారం పనిచేస్తే రూ.300ల వేతనం వస్తుందన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ నారాయణస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ ఉన్నారు.

## కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ నాయకులు

**ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షకులకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన చట్టాలను రద్దు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలరాజులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సోమప్ప సర్కిల్‌లో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి అందరిని ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ 44 కార్మిక హక్కుల చట్టాలను కుదించిందన్నారు. ఏప్రిల్ నుంచి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మునెప్ప, నాగేంద్ర, రాఘవేంద్ర, అంజినయ్య, ఉరుకుందు, నరసింహులు, ఓబులేసు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇంటి తాళాలు ఇవ్వాలి


కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న సీపీఐ నాయకులు

**ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంలోని టిడ్కో గృహాల లబ్ధిదారులకు ఇంటి పత్రాలు ఇచ్చి తాళాలు మరిచారని వెంటనే ఇంటి తాళాలు ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, కేసీ జబ్బార్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పేదల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి టిడ్కో గృహాలను నిర్మించిందన్నారు. అయితే గృహాలకు సంబంధించిన పత్రాలను మాత్రమే లబ్ధిదారుల చేతుల్లో పెట్టి ఇంటి తాళాలు ఇవ్వలేదన్నారు. ఆ గృహాల్లో ఎవరూ లేకపోవడంతో గృహాలు కాస్తా శిథిలావస్థకు చేరుతున్నాయన్నారు. వెంటనే లబ్ధిదారులకు టిడ్కో గృహాల తాళాలు ఇవ్వాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. ఇందుకు స్పందించిన కమిషనర్ టిడ్కో గృహాల లబ్ధిదారులకు తాళాలు ఇవ్వాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

## ఆవుల మందతో పంటలన్నీ నాశనం

● దేవరబెట్ట గ్రామ రైతులు ఆందోళన


పంటను ధ్వంసం చేస్తున్న ఆవుల మంద

**కోసిగి ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** మండలంలోని దేవరబెట్ట గ్రామానికి చెందిన రైతుల పంట పొలాలు ఆవుల మంద దాడితో తీవ్రంగా నష్టపోతున్నామని గ్రామానికి చెందిన రైతు బోయ శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశాడు. జంపాపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులకు సంబంధించిన సుమారు 30 ఆవుల మంద పంట పొలాలపై వదలడంతో నష్టాన్ని కలిగిస్తున్నాయని, గ్రామ పెద్దలకు తెలియజేసినప్పటికీ ఎలాంటి పరిష్కారం జరగలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉల్లి, సజ్జ పంటలతో ఆవుల మందతో పంటలు పూర్తిగా నాశనమైపోయిందని రైతు బోయ శ్రీనివాసులుకు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆవుల యజమానులపై కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు రైతు తెలిపారు.

## దేవర్ల సందడి

**ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం దేవర్ల సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే కడివెళ్ల, మసీదుపురం, మాస్మాన్‌దొడ్డి, కందనాతి తదితర గ్రామాల్లో దేవతామూర్తులకు అర్చకులు జలాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రజలు కుంబాలతో నైవేద్యాన్ని తీసుకువచ్చి అమ్మవార్లకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్‌ఐ కె.శ్రీనివాసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## నేడు సూగూరులో దేవర

**మంత్రాలయం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** మండలంలోని సూగూరు గ్రామంలో దేవమ్మ, మారెమ్మ దేవర ఉత్సవాలు బుధవారం వైభవంగా జరగనున్నాయి. ఆందుకోసం గ్రామ పెద్దలుఎంతో ప్రతిష్టాత్మకంగా అన్నీ ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలనుంచి వేలాది మంది తరలి రానున్నారు. మారెమ్మ, దేవమ్మ దేవాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో చూడముచ్చటగా అలంకరించారు. ఉదయం నుంచి ఊరేగింపులతో అమ్మవార్లకు నైవేద్యం సమర్పణ చేయనున్నారు. డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు. ఎస్‌ఐ శివాంజల్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**నందవరం:** మండల పరిధిలోని జగ్గాపురం గ్రామంలో బుధవారం పెద్దమ్మ, దేవమ్మ దేవర జరుగుతున్నట్లు పెద్దలు గట్టాల రంగన్న , జగ్గాపురం చిన్నఈరన్న, మల్లేష్ తిమ్మప్ప, గడంగం నరసింహులు, ఎల్ఐసీ గోపాల్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ జగ్గాపురం గ్రామంలో దేవర ఉత్సవాలు ఘనంగా జరగనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు, ప్రముఖ నాయకులందరు పాల్గొంటారన్నారు.

## నేడు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

**గోనెగండ్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** మండలపరిధిలోని ఐరన్‌బండ గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకులాపరమేశ్వరి దేవి ఆలయం, సుంకులాపరమేశ్వరి, మారెమ్మ దేవి, లింగమయ్య స్వామి, గోపురకలశం, ధ్వజస్తంభం, వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం నుంచి నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.


ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న అమ్మవారి విగ్రహాలు

# ఘనంగా రథసప్తమి

● పంచరథాలపై దేవతామూర్తుల ఊరేగింపు
● వేలాదిగా తరలివచ్చిన భక్తులు

**మంత్రాలయం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో పంచరథాలైన చెక్క, గజవాహనం, వెండి, బంగారు, నవరత్నాల రథాలపై మధ్వాచార్యులు, రాఘవేంద్రస్వామి, రాముడు, బృంధావనం, వంటి దేవతామూర్తులను అధిష్టించి ఊరేగించారు. రథాలకు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మహా మంగళహారతులు ఇచ్చా ముందుకు నడిపించారు. రథం ముందు మహిళల భజన పాటలు, హరిదాస కీర్తనలు, కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. అనంతరం పూర్ణబోధ పూజా మందిరంలో మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది. కార్యక్రమంలో విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, గౌతమాచార్, సుజీంద్రాచార్, మేనేజర్ శ్రీపతాచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, అనంతపురాణిక్, జేపీ స్వామి, వ్యాసరాజాచార్, రవికులకర్ణి, అనంతస్వామి, ప్రకాషాచార్ పాల్గొన్నారు.

**గోనెగండ్ల:** మండల కేంద్రంలోని వైష్ణవ దేవాలయాలు, అమ్మవారి దేవాలయాలు, శివాలయాల్లో మంగళవారం రథసప్తమి సందర్భంగా అర్చకులు, శివస్వాములు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే ఆయా దేవాలయాల అర్చకులు సూర్యనమస్కారం చేయించారు. అలాగే శివాస్వాములు రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరోగ్యప్రదాత, ప్రత్యక్ష దైవమైన సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం శివాలయాల్లో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శివస్వాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


పంచరథాలపై ఊరేగుతున్న దేవతామూర్తులు

# వదిలే ప్రసక్తే లేదు

తహసీల్దార్ కార్యాలయం ముందు గ్రామస్థుల నిరసన

**మంత్రాలయం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** మండలంలోని చెట్నహల్లి గ్రామం వద్ద సర్వే నెం.113లోని శ్మశానంగా ఉన్న స్థలాన్ని వదిలే ప్రసక్తే లేదని గ్రామస్థులు అన్నారు. మంగళవారం గ్రామ సర్పంచ్ బెస్త ఆంజనేయ, ఉప సర్పంచ్ వీరనాగుడు, ఎంపీటీసీ రామాంజనేయులు, మల్లేష్, చాపల నగేష్, నాగరాజు, మాజీ సర్పంచ్ వెంకటేష్, తిక్కస్వామి ఆధ్వర్యంలో గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50ఏళ్ల నుంచి సర్వేనెం.113లోనే బీసీ, దళితకులాల వారు శ్మశానంగా వాడుకుంటున్నామని తెలిపారు. జగనన్న ప్రభుత్వం వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, తాము ఎక్కడ మృతదేహాలను అంత్యక్రియలు చేసుకోవాలని నిలదీశారు. సర్వే నెంబరు 125, 126లో దాదాపు నాలుగెకరాలు శ్మశానికి కేటాయించినప్పటికి అదీ అగ్ర కులాల వారికి మాత్రమే ఉందని, తమకు పూర్వ కాలం నుంచి 113 సర్వేనెంబరులోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నామన్నారు. విషయం తెలుసుకున్న సీఐ రామాంజులు, ఎస్‌ఐ శివాంజల్ సంఘటనా స్థలానికి చేరుకుని సర్ది చెప్పి సమస్యను తహసీల్దార్‌కు విన్నవించారు. మూడు రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఉరుకుందు, పరుశురాముడు, రాజన్న, పెద్ద పంపయ్య, అంజిని, లక్ష్మన్న, గణేష్, సున్నం జయన్న, నరసింహులు, మేకల మల్లేష్, వడ్ల ఈరన్న, ఆచారి, నాగేంద్ర పాల్గొన్నారు.


చెట్నహల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై బైఠాయించిన గ్రామస్థులు

### ఇళ్ల సమీపాల్లో శవాలను పూడ్చుతున్నారు

**మంత్రాలయం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో దళిత కుటుంబాల ఇళ్ల సమీపాల్లో మృతదేహాలను పూడ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమన్న, ప్రసాద్, నరసింహులు, దానియల్, రాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మంత్రాలయం ఎస్‌ఐ శివాంజ ల్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెం 113లోని 1.50 ఎకరాల సిలింగ్, రస్తా పోరంబోకు భూమిలో దళితులకు పట్టాలు ఇవ్వగా ఇళ్లను నిర్మించు కొని జీవిస్తున్నామని తెలిపారు. గతంలో ఉన్న ఇక్కడే ఉన్న శ్మశాన వాటికను 2018లో ప్రభుత్వ అధికారులు సర్వేనెంబరు 125,126లోని 3.54 ఎకరాలు అన్ని కులాలకు కేటాయించారన్నారు. ఇది గ్రామానికి దూరంగా ఉండటంతో కొంతమంది తమ ఇళ్ల మధ్యనే శవాలను పూడ్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు బీసీ కులాల నుంచి ప్రాణహాని ఉందని, న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో తిక్కయ్య, కాశీం, ఏసు, అబ్రహాం, దేవేంద్ర, దానప్ప, బాబు తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న జైభీమ్ ఎంఆర్‌పీఎస్ నాయకులు

## పార్కుల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే


పెద్దపార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు అవసరమైన పార్కులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మాచాని సోమప్ప పెద్దపార్కును పరిశీలించారు. అలాగే సోమప్ప సర్కిల్‌లో ఫుట్‌పాత్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని శిల్పా ఎస్టేట్, సంజీవయ్యనగర్‌తో పాటు ఆయా ప్రాంతాల్లో ఉన్న పార్కులను అదునాతనమైన విధంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పెద్ద పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే పట్టణంలోని ఆయా సర్కిళ్లను అభివృద్ధి చేయడంతోపాటు ప్రజలు వాకింగ్ చేసేందుకు వీలుగా ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, నాయకులు మిఠాయి నరసింహులు, తురేగల్ నజీర్, ప్రతాప్‌రెడ్డి, బచ్చాల రంగన్న, ఉరుకుందు, పెద్ద రంగన్న, రవికుమార్, వీరేష్, గోవిందు, రామకృష్ణ, ఇసాక్, అమాన్, కృష్ణ పాల్గొన్నారు.

## చిరు కార్మికులకు వేతనం పెంచాలి



ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

**ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న చిరుకార్మికులకు ప్రభుత్వం వేతనాన్ని పెంచాలని సీఐటీయూ నాయకులు రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎంఈవో-1 కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నైట్ వాచ్‌మెన్‌లు, స్వీపర్లుగా పనిచేస్తున్న వారికి నెలకు రూ.3వేలు మాత్రమే ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలకు ఈ వేతనాలు ఏ మాత్రం సరిపోవడంలేదన్నారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు సైతం కనీస వేతనాన్ని పెంచాలన్నారు. చిరు కార్మికులుగా పనిచేస్తున్న వీరికి నెలకు రూ.12వేల వేతనాన్ని పెంచి ఆదుకోవాలన్నారు. అలాగే ఆయా పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న వారికి గుర్తింపు కార్డులను మంజూరు చేయాలన్నారు. అనంతరం ఎంఈవో-1 ఆంజనేయులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు కవిత, లక్ష్మీ, రామకృష్ణ, రాధమ్మ, నారాయణ, ప్రభాకర్, నరసింహులు, బాషా పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన నాయకులు


ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి, రాఘవేంద్రరెడ్డి

**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలోని శాంతిభద్రతలపై చర్చించారు.

**మంత్రాలయం:** నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను టీడీపీ మంత్రాలం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాఘవేంద్రస్వామి మెమెంటో, ప్రసాదం, పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలపై చర్చించారు.

## క్యాన్సర్‌తో యువకుడి మృతి

**కోసిగి ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):** క్యాన్సర్ ప్రస్తుతం అత్యంత ప్రమాదకరమైన వ్యాధి. శరీరంలో ఏ భాగానికైనా క్యాన్సర్ రావచ్చు. కోసిగిలోని 3వ వార్డు వాల్మీకి నగర్‌కు చెందిన నేల కోసిగి జక్కుల నరసన్న (37) అనే యువకుడు బోన్ క్యాన్సర్ బారిన పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వరల్డ్ క్యాన్సర్ డే రోజే క్యాన్సర్ మహమ్మారి కాటేయడంతో ఆ కుటుంబంతో విషాదచాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి సోదరుడు రఘునాథరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, నాడిగేని అయ్యన్న, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణలు నరసన్న భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. అనంతరం మట్టి ఖర్చులకు కుటుంబ సభ్యులకు సాయం అందజేశారు. మృతుడికి భార్య హుశేనమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.


నరసన్న భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

## ఘనంగా రామక్కమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ

**కౌతాళం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రమైన కౌతాళంలో కామవరం దారిలో నూతనంగా నిర్మించిన రామక్కమ్మవ్వ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఉదయం పూజారుల ఇంటి నుంచి మహిళలు కలశాలతో అమ్మవారి విగ్రహాల వద్దకు చేరుకుని పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని టీడీపీ నాయకుడు చెన్నబసప్ప ఆలయ పూజారి ఇంటికి వెళ్లి దర్శించుకున్నారు. నిర్వాహకులు సన్మానించారు. అనంతరం అమ్మవారిని వివిధ పార్టీల నాయకులు రామకృష్ణారెడ్డి, సురేష్ నాయుడు, వెంకటపతి రాజు, సౌద్రి బసవరాజు, ప్రహ్లాదాచారి, గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్ దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## మహిళ ఆచూకీ లభ్యం

**మంత్రాలయం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం మండలంలోని సూగురూ గ్రామ దేవర కోసం వచ్చిన మహిళ షంషాద్‌బీ ఆచూకీ లభ్యమైంది. మంగళవారం గోనెగండ్ల సమీపంలో సదరు మహిళ ఉన్నట్లు గుర్తించి మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌కు తీసుకవచ్చి భర్త రజాక్‌కు అప్పగించారు.

# సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలం

**పెద్దకడుబూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఏఐకేఎస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం పెద్దకడుబూరు ఎంపీడీవో కార్యాలయం ముందు ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు భాస్కర్ యాదవ్, వీరేష్, మబ్బు ఆంజనేయులు మాట్లాడుతూ పెద్దకడుబూరులోని లక్ష్మీపేటలో 30ఏళ్ల క్రితం నీటి ట్యాంకును ఏర్పాటు చేశారన్నారు. అయితే ప్రస్తుతం ఆ ట్యాంకు కూలేందుకు సిద్ధంగా ఉన్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లో డ్రైనేజీ, వీధిదీపాలు, తాగునీటి సమస్యలు ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రజల కష్టాలను తీర్చాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తిక్కన్న, రెక్కల గిడ్డయ్య, వీరేష్, వీరాంజనేయులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏఐకేఎస్ నాయకులు

## రీ సర్వే సక్రమంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ కళ్యాణి

**గోనెగండ్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే పనులు సక్రమంగా నిర్వహించాలని ట్రైనీ కలెక్టర్ కల్యాణి ఆదేశించారు. మంగళవారం గోనెగండ్లలో తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సర్వే రికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్, వీఆర్వోలు, సర్వేయర్‌తో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే పనుల్లో తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

**కౌతాళం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం నిర్ణయించిన తేదీలోగా పీఎంఏఐ-ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. మండల పరిధిలోని కుంటనహల్ గ్రామంలో నిర్మిస్తున్న ఇళ్లను కాంట్రాక్టర్ పెంచల్ రెడ్డి ఉపాధి సిబ్బందితో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న చెత్త సేకరణ సంపద కేంద్రాన్ని పరిశీలించారు. వీలైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ ఇంచార్జీ శ్రీనివాసులు నాయుడు ఉపాధి సిబ్బంది మహమ్మద్ రఫీ ఉన్నారు.

## చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**పెద్దకడుబూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** ఈనెల 7న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు యువరాజు, సతీష్ కోరారు. మంగళవారం పెద్దకడుబూరులో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఈనెల 7న హైదరాబాదులో చేపట్టే లక్షడప్పులు, వేల గొంతుల కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో శాంతిరాజు, అనిల్, బొగ్గుల రోగెన్న, బాబు, రాజు పాల్గొన్నారు.

## దళితవాడల అభివృద్ధి బీవీతోనే సాధ్యం

**ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని దళితవాడల అభివృద్ధి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితోనే సాధ్యమని 7వ వార్డు ఇన్‌చార్జి నాయకంటి అంబేడ్కర్ అన్నారు. పట్టణంలోని 7వ వార్డులో రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా దళితవాడలోని ప్రజలు రోడ్డులేక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దళిత వాడలపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు పనులను పూర్తి చేసేందుకు పూనుకున్నారన్నారు. త్వరితగతిన రోడ్డు పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు డైరెక్టర్ శాలేమ్, శివసూర్యనారాయణ, రాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

**మంత్రాలయం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** బీసీ కార్పొరేషన్ రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా నియోజకవర్గానికి రూ.4.14 కోట్లు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఆయా బ్యాంకు లింకేజీతో సబ్సిడీ రుణాలు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో ఈనెల 7లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## వైభవంగా కాశీనీలకంఠేశ్వర స్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

**గోనెగండ్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని వీవర్స్ కాలనీ కాశీ నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పార్వతీదేవి, కాశీనీలకంఠేశ్వరస్వామికి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారి కల్యాణాన్ని పురోహితులు సాగర్‌కుమార్‌శర్మ జరిపించారు. అలాగే పదకొండవ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం 9గంటలకు నవగ్రహపూజ, నిర్మలాభిషేకం, 10 గంటకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణం, అనంతరం పల్లకోత్సవం, 1గంటకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మిగనూరు, బళ్లారి, ఆదోని, కోడుమూరు, కర్నూలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.